## నాంది

శ్రీమత్కామితదాత వం చనెదనా? శ్రీకంఠ! కామారివే!
ఆమూ లం బమృతావతారు డననా? హాలా హలాహారివా
హా! మా మానసనాథుడం చనెదనా? అర్ధమ్ము స్త్రీ మూర్తివే
గా! మాయాంతక! నందమూ రు నిలయా! గంగాన్న పూర్ణేశ్వరా!
కం. బోళా శంకరు డనుటయు
వేళాకోళమ్ము వట్టి వేడుక మాటే!
మాలా కంధరు. శిరముల్
పాలాడు కొనిన తదుపరి. పాలించుటచే!
(నా ద్యంతమున సూత్రధారుడు ప్రవేశించును.)

సూత్ర: ఏమోయ్. రసతరంగిణీ! ఇలా వస్తావ్ ఒకసారి.
నటి: (ప్రవేశించి) నన్నలా పిలువ కండని ఎన్నిసార్లు చెప్పాలి మీకు?
సూత్ర: ఏం? పిలి స్తే తప్పా? అది మా నాయనమ్మగారి పేరు.
నటి: అందుకనే వద్దనేది.
సూత్ర: ఔనౌను. నువ్వేమో యౌవనవతివి. నాగరకురాలవు. అందగత్తెవు. ఆవిడ...
నటి: చాల్లెండి. గొప్పగా వ్యాఖ్యానించారు. అదా నా అభిప్రాయం? నే నావిడంతటి దానను కాను. అంత అందగత్తెనూ కాదు సరికదా. ఆ పేరుతో పిలిపించుకునే అర్హతకూడా నాకు లేదు.

నాటకం

# ఆచార్య దాక్షిణ్యము

-విశ్వనాథ పావనిశాస్త్రి

సూత్ర: అయినా సరే. నిన్నలాగే పిలుస్తాను. నాయనమ్మకీ. మనుమడికీ వర సే కదా!
నటి: ఎప్పుడూ మీ మాటే మీది! ఒట్టి మొండి ఘటం! ఇంతకూ ఎందుకు పిలిచారో త్వరగా చెప్పండి. నా కవతల బోలెడంత పనుంది.
సూత్ర: విశ్వనాథ సత్యనారాయణగారని ఒక మహాకవి ఉన్నాడు. ఎరుగుదువా?
నటి: మీ కంతా వేళాకోళంగా ఉన్నట్టుంది. నేను వెళుతున్నాను.
సూత్ర: అదేమిటి?
నటి: లేకపోతే ఏమిటా ప్రశ్న మీరూను! "రోజూ తూర్పున ఉదయిస్తూంటాడే సూర్యుడని ఎరుగుదువా?" అన్నట్టుంది. ఆంధ్రులలో ఆ కవిసమ్రాట్టు నెరుగని అక్షరాస్యు లెవరు?
సూత్ర: నే నెరుగను.
నటి: (మూ తి విరుచుచు) ఆఁ! మీ చమత్కారములకేమికాని. విషయం చెప్పండి.
సూత్ర: చమత్కారం కాదే. బాలా! ఒక మహాకవిని గురించి తెలియడం అంటే ఏమిటి? ఊరికే ఆయన పేరు వినడమే ననుకుంటున్నావా?
నటి: మరింకేమిటి?
సూత్ర: ఏమిటా? ఆ మహాకవి వ్రాసినది చక్కగా చదివి. సరిగ్గా అర్థం చేసుకొని. లోకానికి ఆయనను గురించి తెలియ చెప్పగలగడం...తెలిసిందా?
నటి: తెలిసింది.
సూత్ర: (వెక్కిరింపుగా) ఏం తెలిసింది?
నటి: మే మాయన నెరుగుదుమని ఇంకా బాగా తెలిసింది.
సూత్ర: ఔనౌను. మహా నటివి కదూ!
నటి: అంటే మీ ఉద్దేశం? నా కాయన అర్థం కాకపోయినా అర్థమైనట్టు నటిస్తున్నాననా?
సూత్ర: అని నే నన్నానా?
(నటి కోపంతో విసురుగా వెళ్ళిపోబోతుండగా సూత్రధారు డామెను చేయి పట్టుకొని ఆపి)
మరీ అంత కోపమైతే ఎలా. ప్రియా! ఏదో మాట వరస కన్నానులే! అయినా. పండితుల మనుకొని విర్రవీగే కొందరు పూర్వ మహాకవులను గురించి సర్వమూ తెలిసినట్లుగా దుర్వ్యాఖ్యానాలు చేస్తున్న ఈ రోజుల్లో నీ వంటి చిన్నవాళ్ళు ఒక మహాకవిని అలా సవ్యంగా అర్థం చేసుకున్నాము అంటే తప్పుకాదు మరి?
నటి: ఆర్యా! ఇంత చిన్న వయసులోనే అంత నొసలు వెక్కిరించగల నోరుందే మీకు? మీరు కొంచెం పెద్దవారైతే ఈ దేశాన్ని బ్రతక నిస్తారా?
సూత్ర: (నవ్వుతూ) నేటి విమర్శకుల మనుకునే వాళ్ళు నన్నంతకాలం బ్రతకనిస్తారా?
నటి: శివ శివా! అమంగళం శాంతించుగాక! ఒక్కటీ శుభ్రమైన మాట రాదు గదా మీ నోట! ఇంతకూ విశ్వనాథవారి విషయమేమిటో త్వరగా చెప్పండి.
సూత్ర: ఆయన కొక కుమారుడున్నాడు.
నటి: ఒకరు కాదు. ఇద్దరున్నారు.
సూత్ర: ఆ మాటకొస్తే ముగ్గురుండేవారు. మన పని ఇప్పుడు ఒకరితోనే. ఈయన పేరు పావనిశాస్త్రులు. ఈయన 'ఆచార్య దాక్షిణ్యము' అని ఒక నాటకం వ్రాశాడు.
(ఇంతలో మారిషుడు ప్రవేశించును)
మారిషుడు: ఏమిటి. బావా? ఆచార్య దాక్షిణ్యమా? పేరే చిత్రంగా ఉందే! ఎవరా ఆచార్యుడు? ఏమి టా దాక్షిణ్యం?
సూత్ర: రావయ్యా. మారిషా! రా! నువ్వు లేందే ఎలా? మనస్సులో సరిగ్గా నీ గురించే అనుకుంటున్నాను. ఇది గురు శిష్యులైన ద్రోణార్జున. ఏకలవ్యుల గాథకు సంబంధించిన నాటకము.
మారి: అలాగా? అయితే. ఈ నాటక మెందు కిప్పుడు? ఏకలవ్య గాథలు. నాటకాలు ఇదివరకే చాలా ఉన్నాయనుకుంటానే!
సూత్ర: ఎందుకు లేవు? ఉన్నాయి. కాని-

"-ఈ ప్రపంచక మెల్ల నెల్లవేళ. తినుచున్న యన్నమే తినుచున్న దిన్నాళ్ళు. తన రుచి బ్రతుకులు తనవి గాన" అని విశ్వనాథవారు అన్నట్లుగా దేని రుచి దానిదే! ఈ నాటకంలో నాయకుడు ద్రోణుడు. ద్రోణుడు. అర్జునుడు కలిసి కుతంత్రం చేసి ఏకలవ్యుని అన్యాయం చేశారనీ. "అర్జునా! ధనుర్ధారులలో నీ కంటే అధికుడు లేకుండా చేస్తాను" అని ద్రోణుడు అర్జునుని కిచ్చిన మాట నిలబెట్టు కోవటం కోసమే ఏకలవ్యుని బొటనవేలు తెగ గొట్టబడిందనీ లోకాభిప్రాయము.

అయితే ఏకలవ్యుని విద్యా వైశారద్యం చూసిన నాటికి అర్జునుడు బాలుడు. అతని విద్య ఇంకా అభ్యాస దశలోనే ఉంది. తరవాత తరవాత అతను అనన్య సాధ్య సైంధవ శిరచ్ఛేదన కర్తా. సర్వ వ్యూహ రచనా భేదనా పటుసామగ్రీ భర్తా. కాలకేయ నివాత కవచ సంశప్తకాది మహారాక్షస సైన్య సంహర్తా. నిమేష మాత్ర త్రిజగత్సంహార పాశుపత మహాస్త్రవేత్తా అయినాడు. కాని. ఏకలవ్యుని నాటికి భీముని తోడు తీసుకుని ద్రుపదుని పైకి యుద్ధానికీ వెళ్ళలేదు. అప్పటికి కుమారాస్త్ర విద్యా ప్రదర్శనం కూడా జరగలేదు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఒక పెద్ద వస్తాదు. తన చిన్నతనంలో ఒక ప్రాంతీయ వస్తాదుని చూసి ఆశ్చర్యపోయిన స్థితి అది. ఈర్ష్య జనించడానికి ఏకలవ్యుడు వీళ్ళ వయస్సు వాడూ కాదు.

ప్రియ శిష్యుడో గ్రియ శిష్యుడో తరవాత. అటువంటి స్థితిలో ఉన్న అర్జునుని కిచ్చిన మాటను నిలబెట్టు కోవడానికై ద్రోణుడు ఏకలవ్యుని ఎడల అలా ప్రవర్తించడంలో గల ఔచిత్యమేమిటి?

ఎవనినైనా అద్వితీయునిగా చెయ్యాలంటే. వాని పైననే దృష్టి కేంద్రీకరించి. వాని నధికుని చెయ్యాలి గాని. వానికన్నా అధికులైన వారి నందరినీ నిర్జించుకుంటూ పోతావా? అలా పోతే ఎంతమందినని నిర్జిస్తావు? ఎన్నాళ్ళని నిర్జిస్తావు? చివరకు నిన్ను నువ్వే నిర్జించుకోవలసిన స్థితి ఏర్పడుతుందే! ద్రోణుడి కీ మాత్రం తెలియదంటావా? కాబట్టి ద్రోణుని వంటి గురువు అలా

ప్రవర్తించాడంటే. దానికి నువ్వనుకున్న ఈ అల్పమైన కారణం కాక మరేదో వేరే బలమైన కారణ ముండి ఉంటుంది. అదేమిటని నిశితంగా ఆలోచించాలి. పూర్వ వ్యాఖ్యానాలు తిరగవెయ్యాలి; లేదా పండితుల నడగాలి. అంతేగాని ఎవడో, ఎప్పుడో, ఏదో అన్నాడని ప్రజలంతా ఔరభ్రకమల్లే వాని వెంట పడిపోకూడదు.

అదిగో! అది నిరూపించడమే ఈ నాటకం యొక్క ప్రధాన లక్ష్యం. ఈ నాటకాన్ని ప్రదర్శించాలని ఉంది నాకు. మీ చెల్లెలి అభిప్రాయం ఏమిటో కనుక్కుందామని పిలిచాను. ఇంతలో నువ్వు వచ్చావు.

నటి: అన్నా! రసనిర్దేశకులైన సూత్రధారులు నే డెందుకో ఆవేశ పూరితులైనట్లున్నారు. ఆర్యపుత్రా! శాంతించండి. మన మిప్పుడు ప్రదర్శించ బోతేం దా నాటకమే! ఇక్కడ సమాబిష్టులైన పెద్దలంతా దాని కోసమే ఎదురు చూస్తున్నారు. నే నిందాక పని ఉన్నదంటూ తొందర పడిందికూడా రంగాలంకరణ కోసమే! ఇక రండి. నాయకుడైన ద్రోణుడు భార్యయైన కృపితోను. కుమారుడైన అశ్వత్థామతోను ప్రవేశించుచున్నాడు. మనము పోవుదము.

(ఇది ప్రస్తావన)

## మొదటి అంకము

(అరణ్య మార్గము- ద్రోణుడు. కృపి. అశ్వత్థామ ప్రవేశింతురు. అశ్వత్థామకు సుమారు పదమూడు పద్నాలుగు సంవత్సరముల వయస్సుండును.)

ద్రోణు: , ఇది విచిత్రమ్ము చూడుమో సుదతి! మహిని
జంతుసకలమ్ము తన దగు సంతునందు
మాట లక్ష్యమ్ము తెనట్టి మకురునందు
కెరలి కోపమ్ము కొని శిక్షించవచ్చు

కాని తా ననుకొనకుండగానె. ఆ వి
ధించు శిక్షా విధానమ్ము తీవ్రమైన
వాని కంగ వైకల్య మేర్పడనువచ్చు!
తదువరి మరి వగచి ఫలితమ్ము లేక.

కృపి: రామ రామ! మహా తపస్సంపన్నులు. ధనుర్వేద పారంగతులు నయిన శ్రీ భరద్వాజ తనయులకు నే డెందుల కింత భారమైన యూహలు వచ్చుచున్నవి?

ద్రోణు: ఊహ కాదే. అర్ధాంగీ! ఆ పొదలలో చూడుము ఆ బాల ఏకలములు! తల్లి ఎంత వారించినను వినక పరుగు లిడుచుండగా, దూరముగా పోయిన పెద్ద దాని కేమి ప్రమాదము వాటిల్లినో యని దాని నదలించుటకై తల్లి ముట్టె విదలించినది. ఆ పెద్దదానికి కాలు విరిగినట్లున్నది. తల్లి బాధతో తల కిందు లగుచున్నది.

కృపి: అయ్యయ్యో! దాని కాలి కేదైన ఇంత చికిత్స చేసి రారా, అశూ!

(అశ్వత్థామ వెడలును)

ద్రోణు: ఓసి. కృపీ! చికిత్స చేసితిమి-సరే! కాని. దానికి సహజమైన పూర్వ లాఘవమును. ఉత్సాహమును మరల వచ్చునా యని నాకు సందేహముగా ఉన్నది.

కృపి: స్వామీ: ప్రతి చిన్న విషయమునకు మీ రిట్లు కదలిపోదురు. మీ హృదయ మంత మెత్తన. అదే హృదయము మరల వట్టుదలే వచ్చినచో దానికన్న వజ్రము మెత్తన. ఈ బ్రహ్మక్షత్ర గుణ సమ్మిళితమైన మీ హృదయమున కొక నమస్కారము.

(తెర)

## ద్వితీయాంకము

(హస్తినాపురము. భీష్మాచార్యుని సౌధాంతర్భాగము. భీష్మాచారుడేదో భూర్జపత్ర గ్రంథము చదువుచుండును. ద్వారపాలకుడు ప్రవేశించును.)

ద్వార: పితామహులకు జయము. ధనుర్వేద పారంగతుని వలె ప్రకాశించుచు. భార్యా పుత్ర సమేతుడై యున్న ఒక బ్రాహ్మణుని తోడ్కొని కురుకుమారు లందరు తమ సన్నిధానమునకు విచ్చేయుచున్నారు. దేవరకు ముందుగా విన్నవించుటకు వచ్చితిని.

భీష్మ: పరిచారికలను నియమించి. ఆ వచ్చిన స్త్రీలను ఉచిత మర్యాదల సత్కరింపుమనుము. మిగిలిన వారి నిచ్చట ప్రవేశపెట్టుము.

ద్వార: చిత్తము. (నిష్క్రమించును.)

(సుమారు పదిహేను. పదహారు సంవత్సరముల ప్రాయము వారు పాండవ కౌరవులును. ద్రోణాశ్వత్థామలు ప్రవేశింతురు.)

ధర్మరాజు: తాతగారి కభివందనములు. తాతగారూ! వీరు... (అర్ధోక్తిలో ఆగిపోవును)

ద్రోణు: చతుస్సాగర పర్యన్తం గోబ్రాహ్మణేభ్య శ్శుభం భవతు. లోకాస్సమస్తాస్సుఖినో భవంతు. కురుకుల పితామహులైన భీష్మాచార్యులకు భారద్వాజుడైన ద్రోణుడు నమస్కరించుచున్నాడు.

భీష్మ: నమః నమః. సుఖాసీనులు కండు.

(అందరు కూర్చుందురు)

(ప్రశ్నార్థకముగా ద్రోణుని వైపు చూచుచు) తమరు...?

ద్రోణు: మా స్వస్థలము గంగాద్వారము. నే నయోనిజుడను. నా తండ్రి భరద్వాజముని నన్నొక ద్రోణమున పెంచినాడు. తత్కారణముగ నా పేరు ద్రోణుడయినది. తండ్రి వద్ద వేద వేదాంగముల నభ్యసించి; అగ్నివేశ మహాముని వద్ద ధనుర్వేద మభ్యసించితిని. అధికాస్త్రార్థినై శ్రీమహావిష్ణ్వంశ సంభూతులు. తమకును గురువులు నయిన శ్రీభార్గవరాముల శుశ్రూష చేసి బ్రహ్మశిరో నామక దివ్యాస్త్రముల సంపాదించితిని. ఉత్తమ రాజాశ్రయమునకై సంచరించుచు ఈ కుమారుల కంట బడితిని. మీ ఆస్థానమందు కురు కుమారులకు ధనుర్విద్య నేర్పుచున్న కృపుడు నా బావమఱదియే! వీడు నా కుమారుడు. (అశ్వత్థామతో) నాయనా! పెద్దలకు నమస్కరింపుము.

అశ్వ: అహంభో అభివాదయే!

భీష్మ: కేశవార్పణమస్తు! (అని చేతులు జోడించుచు) భారద్వాజులైన ద్రోణులా మీరు?! నే డెంత సుదినము! మీ రాకతో మా హస్తినాపుర సామ్రాజ్యమే పూతమైనది. మనము ఏకగురుశిష్యుల మయ్యును, మీరు మా కన్న వయస్సులో చిన్నవారయ్యును మీ గురించి మేము విన్నదానిని పురస్కరించుకొని మీకు నమస్కరించుచున్నాను. మా కృపాచార్యులవారు మీ గురించి ఎప్పుడును చెప్పుచునేయుందురు. ఇప్పుడే వారికి కబు రంపింతము... ఓయీ! మహాలంబుడా!

ద్వార: (ప్రవేశించి) ఆర్యా!

భీష్మ: నీవే స్వయముగా నేగి కృపాచార్యులవారిని వారి సోదరీ భావుకులు పుత్రునితో సహా విచ్చేసి మన సౌధమున విడిది చేసియున్నారని చెప్పి వెంటనే తోడ్కొని రమ్ము. పొమ్ము.

ద్వార: చిత్తము. (నిష్క్రమించును)

భీష్మ: నాయనా, ధర్మజా! ఈ మహానుభావులతో మీకు పరిచయ మెట్లైనది?

ధర్మ: తాతగారూ! నేనును. తమ్ముడు దుర్యోధనుడును సోదరు లందరితో కలిసి ఊరి చివరన గల మన రాజోద్యానమునకు పోయితిమి. మొదట పరుగు పందెము లాడితిమి.

దుర్యోధనుడు: తాతగారూ! పరుగు పందెము లొక ఆటయా? ఒకవేళ అయినచో వట్టి నిస్సారమైన ఆట. అందుచేత కర్ణ వికర్ణులు కోరగా జరా సంధుడు బంతి యొకటి తెప్పించినాడు. అది ఆడుద మంటిని.

భీముడు: వెంటనే అదే ఆడితిమి, తాతగారూ!

దుశ్శాసనుడు: ఆడితిమి, ఆడితిమి. వీని తాపులకు నాల్గు బంతులు మార్పవలసి వచ్చినది.

దుర్ముఖుడు, దుర్ధర్షుడు: (ఒకరి వంక నొకరు చూచుచు) పాపము! పరుగెత్తలేక సేవకులు చచ్చినారు.

భీము: పాపము. ఆయాస పడలేక మీరు చచ్చినారు.

వికర్ణుడు: ఎవ్వరును చావలేదు గాని... తాతగారూ! చివరకు బంగారు తొడుగు గల బంతి నొక దానిని తెప్పించి ఆడితిమి. అది పగులకుండా, ఎవ్వరికి అందకుండా, ఎవరెక్కువ దూరము తన్నుదురో వానిని మిగిలిన అందరు కలిసి జేజేలు పలుకుచు ఉద్యానవనము నంతయు త్రిప్పవలయును. అదీ పందెము.

దుర్యో: (భీముని చూపుచు) ఈ బండ యున్నాడే, తాతగారూ! వీడు...

భీము: (మధ్యలో నందుకుని) బండలతో ఆడెడి వారును బండలే!

దుర్యో: కాదులే! వీడు బంతిని ఆకాశము లోనికి తన్నినాడు.

భీము: మరేమి చేయమందురు, తాతగారూ! నేను జాగ్రత్తగా ఎంత దూరము తన్నుదమని ప్రయత్నించినను ఈ * భీమవేగ, వాతవేగు లిద్దరు

---

* కర్ణ, వికర్ణ, జరాసంధ, దుర్ముఖ, దుర్ధర్ష, భీమవేగ, వాతవేగ, దృఢహస్త, సుబాహు, దీర్ఘబాహు, విశాలాక్ష, చిత్రాక్ష, నంద, ఉపనంద, సులోచనులు మొ. వారందరు దుర్యోధన శత సోదరులలోని వారు. వీరి పేర్లు భారతములో ఉన్నవి.)

ఎప్పటి కప్పుడు బంతిని పట్టివేయుచుండిరి. దృఢ హస్త. సుబాహు. దీర్ఘబాహులు కట్టు కట్టి బంతి నా కంద నివ్వరాయెను.

విశాలాక్షుడు: అందుకని బంతిని లాగికొని. ఉద్యానము దాటి. రాచబాట దాటి. బంగరు బయలు దాటి చిట్టడవిలో పడునట్లు తన్నుదురా?

చిత్రాక్షుడు: చివర కది పోయి అడవి మొదలగల ఆ పాడుపడిన నూతిలోననే పడినది.

నందుడు. ఉపనందుడు: అవును మరి! మన పరాక్రమము బంతులకు తెలియవలె కదా!

భీము: ఔనౌను! మన పరాక్రమము అంతిపుర పూబంతులకు తెలియుచునే యున్నది కదా!

ధర్మ: భీమ సేనా! తాతగారి సమక్షమున అట్లేనా మాటాడ వల సినది?

భీము: ఇందు నా తప్పేమున్నది? నా పరాక్రమమును వారు ప్రశం సించిరి. వారి పరాక్రమమును నేను ప్రశం సించితిని. ఉభయుల మర్యాదలు చక్కగా సాగినవి. ఋణమైన ఉంచుకొనవచ్చును గాని మాట యుంచుకొనరాదు. కదూ. దుర్యోధనా?

ధర్మ: (భీమునితో) నీ వూరకుండుము. (సుయోధనునితో) నాయనా. సుయోధ నా! తాతగారి ఎదుట ఇట్లు మాటాడుట ఉచితము కాదని తమ్ములతో నీవును చెప్పుము.

దుర్యో: నీ వెందుకు చెప్పకూడదు? నా తమ్ములని. నీ తమ్ములని నీ కింత భేద భావ మెందులకు? అయినను నా తమ్ముల కొకరి చేత చెప్పించుకొన వల సిన అవసరము లేదు.

ధర్మ: భేదభావమా? ఇది మర్యాదా లక్షణము కాని. భేదభావమా తాతగారూ?

నకులుడు: అన్నా! ఆ విషయములు తాతగారితో తరవాత మాటాడవచ్చును గాని. ముందు బంతి విషయము తేల్చుడు.

సహదేవుడు: బంతి విషయము కాదు. గురుభగినీ పతి విషయము. తాతగారు మనలను ఈ మహానుభావులతో మన పరిచయ మెట్లయిన



దో ఆ వివరములు చెప్పుమన్నారు. మనము అసలు విషయమును వదలి శాఖా చంక్రమణము చేయుచున్నాము.

ధర్మ: అట్లు బావిలో పడిన బంతిని బయట కెట్లు తీయుటయా అని మేము అందరము బావి చుట్టు చేరి ఆలోచించుచున్నంతలో ఈ మహానుభావులు ధనుర్ధారులై వచ్చి బంతిని తీసి మాకిచ్చినారు.

భీష్మ: ఎట్లు తీసి ఇచ్చినారు? ఆ బావి చాలా లోతు-దిగుటకు అనువైనది కూడా కాదు.

అర్జునుడు: మీకు తెలియని దేమున్నది, తాతగారూ! నూతిలో బడిన ఆ కాంచన కందుకము సూర్యకాంతికి తళతళ లాడుచు, స్వాతి నక్షత్రము వలె మెరయుచుండగా దానికి గురి చేసి ఒక బాణమును విడచిరి.

సులోచనుడు: తాతగారూ! ఎంత బంగారు తొడుగున్నను బంతికి బాణము గ్రుచ్చుకొనగా గాలి పోవున్నా, పోదా?

అర్జు: పోకుండగ కొట్టవచ్చును లేవయ్యా!

సులో: ఇప్పుడు మకును తెలియును లేవయ్యా! అప్పు డందరమును ఆశ్చర్యపోయిన వారమే! ఇంకను ఆ ఆశ్చర్యము నుండి తేరుకొనని వాడవు ఇక్కడ నీ వొక్కడవే!

యుయుత్సుడు: తాతగారూ! అట్లు బాణము వెంట బాణముగా ఒకదాని పుంఖమున ఇంకొక దానిని లాగించుచు బాణములను ప్రయోగించిరి. చివరకు గాలమునకు పట్టి లాగినట్లుగా అందరమును బంతిని పైకి లాగితిమి.

అర్జు: అది కాదు ఆశ్చర్యము. మొదటి బాణము గ్రుచ్చుకొనగానే సహజముగా బంతి నీటిమీద దొర్లును కదా! దొర్లి ఏమి జరుగుచున్నది? గ్రుచ్చుకొనిన బాణమును నిటారుగా నిలువనీకుండా, పక్కవాటుగా పడవేసి పట్టుకొని, దానితో సహా నీటిపైన తేలుచు కదలుచుండును. అప్పుడు అక్కడ ఆ బాణమును నిలబెట్టుచు పుంఖాను పుంఖముగా బాణములు విడచుటలో నున్నది ఆశ్చర్యము, రహస్యము సంతయును.


(భీష్ముడును, ద్రోణుడును ప్రశంసగా నవ్వుచు అర్జునుని వంక జూచుచు తల లూచుదురు. ఇంతలో కృపాచార్యుడు ప్రవేశించును. కురు కుమారులందరు లేచి వినమ్రులై తలలు వంచి నమస్కరించుచు నిలుచుందురు.)

కృపాచార్యుడు: భీష్మాచార్యుల కభివందనము. (ద్రోణుని కౌగలించుకొనును) బావా! తిరిగి ఎన్నాళ్ళకు చూచితినయ్యా మిమ్ము! (భీష్ముని వైపు తిరిగి) భీష్మాచార్యా! ఇంతవరకు తమకు శ్రమ ఇచ్చినందులకు మన్నించవలయును. మా సోదరిని ఇప్పుడే రథములో నింటికి పంపించితిని. మా బావగారినికూడా తీసుకొని వెళ్ళెదను.

భీష్మ: శ్రమయా! శ్రమ ఏమున్నది? ఇది మాఅదృష్టము. అయినను ఏమంత తొందర? ఇంచుక సేపు కూర్చుండవచ్చు గదా?

కృపా: (కూర్చుండి) బావా! వీడేనా అశ్వత్థామ?

అశ్వత్థామ: మామా! నమస్కారము!




కృపా: చిరంజీవ! బావా! వీని ఉపనయనము నాడు కదా గంగా ద్వారమునకు వచ్చితిని! తిరిగి నేడు చూచుచున్నాను. ఆహా! ఏమి బంధుత్వములయ్యా!

ద్రోణు: నేనా పేదవాడను. ఇంత దూరము రాలేను. నీవా సర్వ కురుకుల ధనురాచార్యుడవు-రావీలుండదు. ఇక మన కలయిక ఎట్లు?

కృపా: భీష్మాచార్యా! మీ ముందు చెప్పుట కాదుకాని, మాబావ ఆ భార్గవ రాములంతటివాడు.

ద్రోణు: చాలు, చాలు నోయి, కృపా, నీ కృప! వారెవరనుకొనుచున్నావు? శ్రీ భార్గవరాములకు నా కన్న పూర్వులును, ప్రియతములు నైన శిష్యులు. యుద్ధములో శ్రీ గురుదేవులనే మెప్పించిన మహాస్త్రవేత్తలు. వారి ముందరనా నా ప్రశంస!?

భీష్మ: తప్పేమున్నది, మహాత్మా!

శస్త్రాస్త్రాదుల యందున
శస్త్రమ్ములు పట్టి యభ్యసనమున లొంగున్,
అస్త్రమ్ము లెట్లు లొంగు? త
పస్సాసితములయి కాక భారద్వాజా!

అట్టి తపస్సు యొక్క తీవ్రత నాశ్రయించి కదా ఆయా అస్త్రములు తమ తమ ప్రభావములను చూపుచుండుట! మరి ఆ తపస్సునందు మీకున్నంత తీవ్రత సహజముగా మాకుండదు. పైగా, గురువునందు నేను మీ యంత వినయమును చూపలేకపోయితిని. గురుకృప చేసియే అస్త్రములు అధిక ప్రభావముల చూపును. గురుకృప నా కంటె యధికముగా గల మీరే...

ద్రోణు: (మధ్యలో ఆపి) నా యందు మీ రింత గౌరవము చూపుట సమంజసము కాదు. దయచేసి దానిని స్నేహముగా మర్చినచో సర్వదా కృతజ్ఞుడను. నా కది చాలును. అయినా, కృపా! వీరందరు నీ శిష్యులా! ఏమి అఖండులోయి ఒక్కొక్కడు? వీరిని శిష్యులనుగా బడసిన నీ అదృష్టము చూచి నాకు మత్సరముగా నున్నది.

కృపా: ద్రోణాచార్యా! నీ కా మత్సర మక్కర లేదు. ఇకనుండి వీరందరు నీ శిష్యులు కూడాను. ఆశ్చర్యపడకుము, కాదనకుము. భీష్మాచార్యా! నేనే తమతో మనవి చేయవలె ననుకొనుచున్నాను. ఈ కురుకుమారులందరు ఒక్కొక్కడు గ్రీష్మకాల మధ్యాహ్న మార్తాండుడు. ఇందరకు విద్య నేర్పుట నా ఒక్కని వలన అగుటలేదు. మీ రెరుగని దేమున్నది? విద్య తెలియుట, తెలిసిన దానిని ప్రయోగించుట ఒక ఎత్తు; దానిని జాగ్రత్తగా బోధించ గలుగుట మరింకొక ఎత్తు. అందుల కీ ద్రోణాచార్యుడే సర్వ సమర్థుడు. నేనే తమతో మనవి చేసి ఈయనను పిలిపింత మనుకొనుచుండగా, ఆడబోయిన తీర్థ మెదురైనట్లు, నా అదృష్టమున ఆయనయే వచ్చినాడు. ఇకనుండి నే నీ భారమును ఈయన భుజములపై నిలుప నెంచుచున్నాను. దీనికి కురుకుల పితామహులు దయతో అంగీకరించవలె!

కుమారులారా! ఇక మీ రందరు తాతగారికి, గురువులకు నమస్కరించి మీ మీ సదనముల కరిగి నేడు నేర్చిన విద్యలను మననము చేసుకొని నిద్రించుడు.

(కురుకుమారులందరు భీష్మ, ద్రోణ, కృపులకు నమస్కరించి వెళ్ళగా, అర్జునుడు ద్రోణునకు సాష్టాంగ మాచరించును.)

ద్రోణు: అభీష్టసిద్ధిరస్తు. (అని ఆశీర్వదించి లేవనెత్తును). (అర్జునుడు నిష్క్రమించును)

కృప: భీష్మాచార్యా! తమకు సంధ్యావందన వేళ యగుచున్నది. మేమును స్నాన సంధ్యాదుల ముగించుకొని మరల వత్తుము. తమకు అభ్యంతరము లేనిచో అప్పుడు తీరికగా మాటాడెదము.

భీష్మ: కృపాచార్యా! మీ రనుటయును, మేము కాదనుటయునా?

కృపా: మీ ఆదరమునకు కృతజ్ఞుడను. ఇప్పటికే మీకు చాలా శ్రమ ఇచ్చినారము. సెలవు.

(తెర)

## తృతీయాంకము

(భీష్మాచార్యుని సౌధాంతర్భాగము. కృపుడు, భీష్ముడు, ద్రోణుడు కూర్చుని యుందురు.)

కృపా: బావా! నీ ఈ వచ్చుట గంగా ద్వారము నుండి కాదంటివి. మరి ఎక్కడినుండి? నీవు సామాన్యముగా ఉన్న చోట నుండి కదలువాడవు

కావే. దీని కేదో బలమైన కారణ ముండి తీరవలయును. దానిని కొంచెము వివరింతువా?

ద్రోణు: తప్పక వివరింతును. భీష్మాచార్యా! నేనును, నేటి పాంచాల పతియైన ద్రువదుడును చిన్ననాడు సర్వ విద్యలను కలిసియే అభ్యసించితిమి. ఆ దినములలో మేము పరమ సఖ్యముగా నుండెడివారము. అతడు మేము పెద్దయైన తరవాత కూడా అట్లే యుండవలయు ననెడివాడు. తరవాత నాతని తండ్రియైన పృషతుడు మరణించుటయు, అతడు తాను రాజగుటయు సంభవించెను. నేను శ్రీభార్గవరాముల వద్ద విద్య పూర్తి చేసుకొని. (కృపుని చూపుచు) ఈతని చెలియలిని వివాహ మాడితిని. మాకు లేక లేక కలిగిన వాడు ఈ అశ్వత్థామ. వీనిని అతి గారాబమున పెంచినాము. దానికితోడు వీడు శస్త్రాస్త్ర విద్యల నధికముగా నభ్యసించుచు, తోటి రాకుమారులతో నమముగా పెరుగ జొచ్చెను. మాకందమూ లాది పేద భోజనముతో వీనికి ఆకలి తీరక పౌష్టికాహారమునకై నన్ను బాధింప జొచ్చినాడు. నేను పొరపాటున బాల్య మిత్రుడు కదా యని ద్రువదుని పలుకరించి, 'ఏమియు నక్కరలేదు-నా కుమారుని పాల కొరకై యొక్క పాడియావు నొసంగుము చాలు' నంటిని. పరమ లోభియైన ఆ దుష్ట పాంచాలపతి ధన మదముతో కన్ను మిన్ను కానక నన్ను తా నెఱుగనే ఎఱుగనని పలికి, వరూథితో అవరూధికి, సజ్జనునితో దుర్జనునకు సఖ్య మెట్లేర్పడునని నన్నవమానపరచెను. అటుపై గంగా ద్వారమునకు పోయి మనన్కరింపక ఇటు వచ్చితిని.

((అందరు కొంత సేపు మౌనముగ నుందురు)

తరువాత మీ యనుగ్రహము! నా భాగ్యము!

భీష్మ: మహానుభావా! ఇందు మాయనుగ్రహ మేమున్నది! మీ యనుగ్రహమే కావలయును. చూచితిరి కదా మాకురు కుమారులను. వారి వ్యవహారములను. వారందరు నా తమ్ముడైన విచిత్రవీర్యుని తనయులగు ధృతరాష్ట్ర, పాండు కుమారుల పుత్రులు. నా ప్రశ్నకు సమాధానము చెప్పినవాడు అందరిలో పెద్దవాడు-ధర్మరాజు. ఆ కందుకమును నూతిలోనికి తన్నినవాడు భీమ సేనుడు. వాని తరువాతి వార లర్జున, నకుల, సహదేవులు. వీరైదుగురు పాండురాజు కుమారులు. దుర్యోధనాది మిగిలిన నూర్గురు మహారాజైన ధృతరాష్ట్రుని కుమారులు.

కృపు: భీష్మాచార్యా! ఒక్కమాట! బావా! పూవు పుట్టగనే పరిమళించునని ఇందు శత సోదర పరివేష్టితుడైన దుర్యోధనుడు గదా యుద్ధ ప్రియుడు. అమోఘమైన లాఘవము కలవాడు. ఆ భీమ సేనుడు బంతులనే కాదు, దంతులనైన అట్లే తన్నగలడు. అత డమానుష బలుడు. వీరిద్దరకును నిత్య స్పర్ధ. ఆ నకులుడు ఖడ్గ విద్యా ధురంధరుడు. అతని చేత ఖడ్గమున్నచో పర్జన్యుడు వాని నేమియు చేయలేడు. దుర్యోధన సోదరులు గాని, సహదేవుడు గాని- వీరికి సర్వ శస్త్రములు సమానాదరములే. ధర్మజుడు పరమ శాంతుడు. నీవు చెప్పుచున్న విద్య అస లాతని కర్థమగుచున్నదా అని నీకు నిత్యము సందేహము గనే యుండును. కాని అతడు గ్రహించినంత మరెవ్వడును గ్రహించడు. ఇక మిగిలిన వాడర్జునుడు.

భీష్మ: అర్జును డనగా ఆర్యా! ఆ నూతిలోని బంతిని పైకి తీయుటలోని రహస్యమును గూర్చి చర్చించినాడే వాడు.

కృపు: అట్లనా? ఆతడు తప్ప మరింకెవరు దానిని గురించి చర్చింపగలరు! నాకు తెలిసినంతవరకు ఆతనికి ధనుర్విద్య నేర్పుట కన్న సృష్టిలో పరమ సులభమైన పని మరొకటి లేదు. మనము చెప్పెడిదానికన్న ఆతడు గ్రహించునదియే ఎక్కువ. గురువు మాట నిలబెట్టగల సమర్థు డతను!

ద్రోణు: (స్వగతము) నిశ్చయముగా నట్లే. కృపా! వానిని చూచిన క్షణమునందే అనుకొన్నాను ద్రుపదునికి, వీనికి నేదో సంబంధ మున్నదని! వీని తోడనే ద్రుపదుని పొగరణతును. నే నవరూథిననిగా ద్రుపదుని అవహేళన! వీడే నా వరూథము. నా సర్వ శక్తులు వీనికై ధారపో సెద.

భీష్మ: ఆర్యా! ద్రోణాచార్యా! నా కేమియు నవసరం లేదు. మీరు మతోనే యుండి, మా కురుకుమారు లందరను ధనుర్విద్యా విశారదులను చేయవలె. అదియే నే కోరునది. వీరందరు మీ శిష్యులు. ఈ రాజ్యమిక మీది.

(తెరలో) (దూరముగా గంటలు వినవచ్చుచుండును.)

గీ. అంతరిక్షాంతవర్తియౌ ఆత్మవస్తు
తేజమును జగద్వ్యాప్తికి తెచ్చు పైడి
కాల్వ యగు చంద్రు, నల్పమేఘ మొక డడ్డు
సొచ్చి, సొచ్చియు నొక వింత శోభ కూర్చె.

గీ. అడ్డు వచ్చిన జీమూత మట్లె పోయె,
సోమునందున వింతయౌ శోభ మిగిలె
రమ్య ఫాల్గుణ మాస పౌర్ణమిని, రాత్రి
ప్రథమ యామము పూర్తి కావచ్చె నింత.

ద్రోణు: ఆర్యా! ధన్యుడను. నా శక్తి సర్వస్వము నిచ్చుటనే ధారపో సెదను. ఇంక మేము సెలవు తీసుకొందుము. తమకు భోజనాదికములకు వేళ యైనది.

(అందరు నిష్క్రమింతురు.)

(తెర)

## చతుర్థాంకము

(అరణ్యము-ఒక బోయపల్లె. హిరణ్యధన్వుడను ఒక కోయరాజు ప్రవేశించును.)

హిరణ్య: అరే! ఏకా! ఏకా! ఇక్కడ లేడే ఈడు? ఏమయిండబ్బా! ఏమే. సింగీ! ఏకలవ్య డేడకు పోయినాడే? (తెరలోకి విన్నట్లు నటించి) ఆఁ! నీకు నెఱుకలేదా? ప్రొద్దుననగా పాయెనా? అరే! బువ్వ వేళాయె! ఈ పాటికి రాడాయె! ఏమయినట్లు?

(అంతలో సుమారు పాతిక సంవత్సరాల ప్రాయము వాడు, దిగులు ముఖముతో ఏకలవ్యుడు, అతని స్నేహితుడు చిత్రఘటుడు ప్రవేశింతురు.)


హిరణ్య: అరే, చిత్రఘటా! ఏమయిందిరా ఈనికి? ఇట్లుండాడు.

చిత్ర: ఏం కాలే ద్దొరా! ఆ కొండతొర్రకాడ మడుగు మీదికి ఏలబడే రాకాసి సెట్టుంది సూడు! దాని సిటారు కొమ్మన తేనె పట్టొకటి పట్టింది. ఇప్ప తేనెపట్టు. అబ్బ! అదుండి. దొరా! నా గుడి సెంతుంది. దాన్నొక పట్టు పడతామంట డీ సిన్న దొర! ఇప్పుడొద్దులే, దొరా, అన్న! అంటే ఇంటెనా? గుట్టపై కెళ్ళిండు. సెట్టెగబ్రాకిండు. సిటారు కొమ్మ సేరిండు. ఈగల్ని తోలిండు. పట్టు నొంచిండు. ముంత లోకి తేనె నొంపిండు. మంచిది. కిందికి దిగొచ్చు గంద! దిగొచ్చి తాగొచ్చు గంద! ఆఁహాఁ! ఆడనే గుటకే సిండు.

హిరణ్య: అరె! ఏమాయెరా ఇంతకు?

చిత్ర: ఏం కాలేద్దొరా? మత్తులో పట్టు తప్పిండు. అంతే! మడుగులో పడిండు. తేనె మడుగు పాలాయె! ముంత మన పాలాయె! అంతే! దిగాలు మొగం పెట్టుకునున్న డప్పణ్ణించి.

హిరణ్య: అరే! అదేం పనిర, బిడ్డ! నీ పెయత్నం నువ్ జేసినవ్! అది దొరుకలేదు. దానికి బాధెందుకుర? అయినా ఓటి సెప్త. పట్టు సిక్కిందన్న సంబరంతో ఎనక, ముందు జూడక ఆడనే గుటకే సి ➔



వి. అదీ తప్పుకాదుర? అందుకే పట్టు తప్పె! గురుతుంసుకో! ఆ తప్పు మరి సెయ్యకు. అన లీ కొద్దిపాటి ఆలో సెన పెట్టుకుంటివా నిన్ను మించేటో డెవడ్రా. బిడ్డ. ఈ లోకంలో? అయినా నాకు తెలీ కడుగుతా! ఇంత ఇలువిజ్జ నేర్సినవ్ గదా! ఇలా పిట్టలకీ. తేనెపట్టులకీ సెట్టు సేమ లెక్కేవాడికి ఈ బాణా లెందుకుర మన కింక?

చిత్ర: అదేంది. దొర. అట్ల గంటవ్? పిట్టల్నంటె బాణాల్తొ గొడతాం-సరే! తేనెపట్టు ల్నెట్ట గొడతాం?

హిరణ్యా: ఏంర? ఎందు గ్గొట్ట గూడదు?

చిత్ర: ఆఁ! నువు మరీ సెప్తవ్. దొర! తేనె ఒలికిపోదా? తుట్టె సెడిపోదా? ఈగలు కరవ్వా?

హిరణ్యా: ఆఁ! అంతేనేంటి మరి? దానికీ పద్దతు లున్నయ్! బాయిలో పడ్డ బంతినే పైకి లాగినారు గద! సెట్టు పైనున్న తేనెను కిందికి లాగలేమా?

చిత్ర: హట్ దాన్సిగ తరగ! మరీ అంత గోరమా? బాయిలో పడ్డ బంతి నెట్ట లాగుతవ్, దొర. బాణాల్తొ?

హిరణ్యా:. గోర మేందిరా. గుంటడా! మరేం జూసినవ్ నువ్వు? ఆడ. తియ్యలేదురా మొన్నొకాయన?

ఏకలవ్యుడు: ఎక్కడయ్యా? ఎవరాయన?

హిరణ్యా: అబ్బ! ఇప్పటి కొచ్చిందిరా మాట నీ నోట? సరే. ఇను. మన కొండ రాజ్యమవతల గంగ దాటి గజపురం ఉందా?

ఏక: ఉంది.

హిరణ్యా: ఆడ. పట్టు బట్టల బాబు లేల్తుంటరు నూడు రాజ్యం! ఆళ్ళ బిడ్డలకు బాణా లెయ్యడం నేర్పడానికి మరో కొత్త బాపనాయన ఒచ్చిండంట! ఆయన దగ్గరుం దీ యిజ్జ. ఆళ్ళ దగ్గర ఈ బాణా లొట్టి గెయ్యడమే కాదు. మంతిరించి ఏసే యిజ్జ ఉంది అసల్ది. అ స్త్ర యిజ్జ అంటారు దాన్ని. ఒడుపుగ అదికూడా పడితివా ఫో! దాన్సిగ తరగ! ఈ కొండ రాజ్యాల్లోనే కాదు. ఏడేడు లోకాల్లో నీ కెదురుండదు. కావాలనుకున్నది కాళ్ళకాడ కొస్తది.

ఏక: అయితే ఇప్పుడే పోయి ఆయ న్నా విద్య నేర్పమని అడుగుతాను. దొర!

(అని వెనుతిరుగును)

హిరణ్యా: అరే! లేడికి లే సిందే పెయాన మంటరా? అంత తేలికనుకున్నావా అది? దాని కో పద్దతుంది. సెప్తా నాగు.

ఏక: నా క్క పద్దతు లేవీ ఒద్దు. దొర! నా యంతట నే నిట్టాగే పోత!

(అని మరి కొంతదూరం నడచును.)

హిరణ్యా: అట్లనే పోదులే! నా మాటినరా ముందు. ఇట్ట బోతే అసలు మన మొగమైన సూస్తార ఆళ్ళు? సక్కంగ మంచి బట్టలైన ఏసుకపోదు గాని ఉండు.

ఏక: తేద్దొరా! ఎలాగున్నోడు అలాగనే పోయి విద్య నేర్పమని అడగాలంట! అప్పుడే గురువు మెచ్చుకుంటాడంట! దొడ్డ దొర చెప్పినాడు.

(అనుచు నిష్క్రమించును)




హిరణ్యా: అరే! ఆగరా ఆగు! ఆ ఆశారం మన కొండ రాజ్యాల్లో దిర. బిడ్డ! ఆడ వనికి రా దది. ఆళ్ళ కబ్బే! శానా లెక్క లుంటయ్! ఆరి యా డి తస్సా గొయ్య! నే సెప్పెటోడ్ని సెప్తానే ఉన్నా! ఆడు ఎల్లనే ఎల్లిండు. ఏ నాడు సెప్పింది సరింగ బుర్రకు పట్టించుకోడుగంద! ఆడి గోల ఆడిదే! ఎట్టా బతుకుతాడో ఏమో! తొందర పడితే ఆడే సెడిపోతాడు. నా కేంటి? అయినా ఎదవది తండ్రి పేణం గద! ఊరుకుని సావలేదు.

## (తెర)

## పంచమాంకము

(రాజమార్గము. దుర్యోధనుడు. అశ్వత్థామ ప్రవేశింతురు.)

దుర్యో: చూచితివా. అశ్వా. మీ నాయనగారు అర్జునుని యందు చూపించుచు న్న పక్షపాతము.

అశ్వ. అవును మరి! తన పగ ఎవరు తీర్చి పెట్టెదరని ఆయన అడిగినప్పుడు మీ రందరు ఊరుకుండిరి. అతడేమో వెంటనే తాను తీర్చుదన్నడా యె!

దుర్యో: అవునవును. బ్రతుక నేర్చినవాడు గద!

అశ్వ: అదేమి. గదాగ్రజా! అట్లందువు? అతని కున్నంత గురుభక్తి మనకు లేదనుకొనరాదా?

దుర్యో: అశ్వా! ఎంత అమాయకుడవోయి! అందుకే ఇట్లుంటివి. "ఈ ద్రుపదు డు నా కన్యాయం చేసినాడురా. వీనిని బంధించి తీసుకురండు" అని గురువుగా రాజ్ఞాపించినచో నీ వురుకవా. మే మురుకమా? ఈ అర్జునుడేనా దిగి వచ్చినవాడు?

అశ్వ: నిజమే! నన్నేమి చేయమందువు?

దుర్యో: నీ వేమి చేయవలయునో నీకే తెలియవలయును. మాకిప్పటికే ఈ భీమునితో ప్రాణాంతకముగా నున్నది. దానికి తోడు ఈ అర్జునుడుకూడా విజృంభించెనా ఇంక చెప్పెడి దేమున్నది? ఎవడైన ఇంత ధనుర్వ్యసనము కలవాడింకొకడు రావలయును.

అశ్వ: వానిని మానాయనగారు చేరదీయవలె కదా! అంతవానిని చేయవలె కదా!

దుర్యో: అదీ తరవాతి మాట! ఇప్పటికే ఆలస్యమయినది. గురువులు కోపగింతురు. నీవు పద. నేను తరవాత వత్తును. (నిష్క్రమించును.)

(అశ్వత్థామ నడచును)

-ఇది శుద్ధ విష్కంభము-

(కొద్ది దూరములో ద్రోణుని గృహ బహిరంగణము. ద్రోణు డాసీనుడై యుండును. ద్రోణునికి పాదాభివందన స్థితిలో ఏకలవ్యుడు.)

ద్రోణుడు: (అశ్వత్థామను చూచుచు) అయ్యయ్యో! ఎవడురా వీడు? ఎవడైన సాష్టాంగ మాచరించి వెంటనే లేచి నిలబడును. వీ డెంతకు లేవడేమి? ఎవడో దేవానాంప్రియుని వలె నున్నాడు. (ఏకలవ్యు నుద్దేశించుచు) ఓరి. నీ భక్తి పాడుగాను. లేవరా. నాయనా. లే! (ఏకలవ్యుడు లేచి నిలబడును.)నీ వెవరవు? నీ వద్దతి చూడగా కించిన్నాగరకుడవైన నిషాదుని వలె నున్నావు. నన్ను "గురూ" అని పిలచెదవేమి? నీకు నే నెక్కడి గురువును? రాజకుమారులకు గురువు నైనంత మాత్రమున రాజ్యములో నిక అందరకు నేనే గురువునా? మీ మీ గురువులు మీ కుండరా? అదట్లుంచుము. నీ మొగము చూడగా భోజన మెప్పుడు చేసితివో అన్నట్లున్నది. ముందు లోనికి పోయి భోజనము చేసి రమ్ము. (ఏకలవ్యుడు కాదనబోవుచుండగా వారించి) ముందు నోరు మూసుకొని చెప్పినది చేయుము. తరవాత మాటాడవచ్చును. నాయనా. అశ్వా! మీ అమ్మతో చెప్పి ముందు వీని భోజనపు టేర్పాటు చూడుము. (ఏకలవ్యునితో) పొమ్ము.

(ఏకలవ్యుడు. అశ్వత్థామ నిష్క్రమించగా. అర్జునుడు ధనుర్ధారియై ప్రవేశించును.)

అర్జు: గురుదేవా! నమస్కారము. ఎందుకో రమ్మంటిరట! మహామ్యుడు చెప్పినాడు.

ద్రోణు: అర్జునా! ఇట్లు కూర్చొనుము.

(అర్జునుడు సమీపముగా వచ్చి నిలబడును.)

అట్లు నిలబడుట కాదు. ఇట్లు వచ్చి కూర్చుండుము.

(అర్జునుడు పక్కగా ఒదిగి కూర్చుండును.) నీ కొక రహస్యము చెప్పెదను. నీవు దానిని జాగ్రత్తగ పాలింప వలయును సుమా!

అర్జు: గురుదేవా! నా ప్రాణములతో పాలింతును.

ద్రోణు: (స్వగతము) నిత్యవ్యగ్రమైన నీ ఈ వినయ సంపదకే కదా నేను ముగ్ధుడ నయినది. (ప్రకాశముగా) అర్జునా! రాత్రి అందరు నిదుర పోవుచుండగా నీవు చీకటిలో విలువిద్య నభ్యసించుచుంటివి... కాషీదకుడు చెప్పినాడు. నా కెంతో సంతోషమైనది. ఆ శబ్దవేధి-అది వేరే విద్య-దానియం దనేక రహస్యము లున్నవి. అన్నిటిని నీకు చెప్పెదను. దాని కొక క్రమ మున్నది. అది ప్రధానముగ జన్మతః కొంత రావలయును. తరవాతనే నేర్పుట. అది నీకు సహజముగా నున్నది. ఆ పైన నంతయు నేను నేర్పెదను. నీవు తొందర పడకుము. తొందర పడితివా సర్వము చెడిపోవును. ఇప్పటికే అశ్వత్థామ నీ యందు మాత్సర్యము వహించి యున్నాడు. ఇది వానికి పుట్టిన బుద్ధి కాదు. అది నీకును తెలియును.

నే నను కొన్న కార్యమును నిర్వహించగల సమర్థుడవు నీ వొక్కడనే. నిన్ను అప్రతార్యుని చేయుదును. ఇప్పుడే ఈ దర్భాసనము పైనుండి చెప్పుచున్నాను. రథ. మహీ. వాజీ , వారణ యుద్ధములలో గాని. శస్త్రాస్త్ర వ్యూహ ప్రయోగోప సంహారములలో గాని. ద్వంద్వ సంకీర్ణ యుద్ధములలో గాని- ఒకటని ఏమి- ధనుర్ధారులలో ఈ పృథ్విపై నీ యంతటి వాడు లేకుండ చేయుదును. ఇది నా ప్రతిజ్ఞ.

అర్జు: ధన్యుడను. గురుదేవా! ధన్యుడను. గురుకృప నా యందు సంపూర్ణముగా నున్నది. నా కదీ చాలును.

ద్రోణు: నా కదీ చాలదు. నీ యంతటి ధనుర్ధారి ఈ ద్వాపరాంతమున నుండకూడదు. నేను చెప్పినట్లుగా నీవు తొందరపడక సాధన చేయవలయును. ఇక వెళ్ళి రమ్ము. ఇది చెప్పుటకే పిలిపించితిని. రేపు మరి కొన్ని విషయములు చెప్పెదను.

అర్జు: చిత్తము. (నిష్క్రమించును.)

(ఏకలవ్యుడు. అశ్వత్థామ ప్రవేశింతురు.)

ద్రోణు: ఏమిరా? భోజన మప్పుడే అయిపోయినదా?

అశ్వ: ఎంత చెప్పినను వినక చాలు చాలు ననుచు తొందరపడినాడు. నాయనగారూ!

ద్రోణు: సరే! వాని కర్మము. (ఏకలవ్యునితో) ఇంతకూ నీ వెవడవు? నీ కేమి కావలయును?

ఏక: గురూ! అడక్కుండానే అన్నం పెట్టి ఆకలి తీర్చారు. నన్ను శిష్యుడిగా ఏలుకోమని అడిగే ఈ ఒక్క కోర్కకూడా తీర్చండి. మీ పాదా లొదలను.

(మరల పాదములపై బడును.)

ద్రోణు: (ఏకలవ్యుని లేవదీసి) ఓరి. నాయనా! నిన్ను చూచిన కొలది. నీ మాటలు వినుచున్న కొలది నా మన స్సేలనో ఆర్ద్రమగుచున్నది. శిష్యుడో గిష్యుడో తరవాత! ముందు నీ వెవడవో అది చెప్పుము.

ఏక: గురూ! నా పేరు ఏకలవ్యుడు. మేము నిషాదులము. విలువిద్య మా జన్మహక్కు. నా తండ్రి హిరణ్యధన్వుడు- మా నిషాదులకు నాయకుడు. గొప్ప విలుకాడు. మీ గొప్పదనం గురించి చెప్పాడు. వెంటనే బయలుదేరి ఇట్లా వచ్చాను. నన్ను శిష్యుడిగా స్వీకరించండి. కాదనకండి.

కం. మునరుచు బాణాల్ కసిగా
విసరగ గుఱిగా తగులుట వివరింపుడయా!
కసరక దీవింపు డయా!
మసగుచు వెస నేర్చెద నసమానుండనయా!

ద్రోణు: నీ కిదివరకే బాణవిద్య తగినంత వచ్చినట్లు కనపడుచున్నావు. వేరే ఇంకేమి నేర్తువు? దానినే సాధన చేయుచుండుము. అదియే వృద్ధి యగును.

ఏక: ఒట్టి బాణా లేయటంకూడా ఒక విద్యేనా. గురూ?

ద్రోణు: మరైతే ఏమిటంటావు?

ఏక: విద్యంటే అస్త్ర విద్యే విద్య. నా కదీ నేర్పండి. గురూ!

ద్రోణు: ఓరీ. నీ కోరిక బాగుగనే యున్నదికాని. నిషాదాదుల కస్త్ర విద్య నేర్పకూడదురా?

ఏక: అదేమి. గురూ! ఎందుకు నేర్పకూడదు?

ద్రోణు: ఎందుకంటే? ఎందులకో! మన కన్నియు తెలియునా? కొన్నిటికి కొన్నిటికి కొన్ని కొన్ని నియమము లుండును. వానిని ప్రశ్నింపకూడదు. దీని కిదొక నియమము. ఇది ఇంతే!

ఏక: అదేమి. గురూ! మేము మనుష్యులం కామా? శిష్యులం కామా?

ద్రోణు: ఆః! ఇదేమి తర్కమురా? కలికాల తర్కము! మనుష్యు లైనంత మాత్రాన అన్నీ అందరూ నేర్చుకో గలరా? నేర్చుకుంటే మాత్రం వస్తాయా? వచ్చినా సిద్ధిస్తాయా? ఇలా ఎవడు పడితే వాడు. ఏది పడితే అది నేర్చుకుంటూ పోతే సంఘంలో క్రమశిక్షణా. అభివృద్ధీ. సుఖ శాంతులూ ఉండవు. ఈ రహస్యం తెలిసే కొన్ని కొన్ని విద్యలకు కొన్ని కొన్ని నియమములు పెట్టారు మన పూర్వ ఋషులు. అవి ఇప్పుడు చెపితే మాత్రం నీ కర్థ మౌతాయా పెడతాయా? సునిశితమై. సుశిక్షితమైన విశాల దృక్పథంతో ఆలోచించగల హృదయం నీ కుంటే వానిలోని సూక్ష్మములైన జగత్కల్యాణోద్దేశములు నీకే అర్థమవుతాయి. అంతేగాని ఇలా ఆవేశంగా మాట్లాడితే ఆవేశమే మిగులుతుంది కాని ప్రయోజనం శూన్యం. ఇంతెందుకు? మీ నిషాదులలోనే కొన్ని శాబర మంత్రాలున్నాయి-వాని నెవరికి పడితే వాళ్ళకు. ఎలా పడితే అలాగ. ఎప్పుడు పడితే అప్పుడు నేర్పుతాడేమో అడిగిరా మీ కులగురువును? పెద్ద వేదాంతి వలె మాట్లాడుచున్నావు! ఊరికే అడ్డదిడ్డమైన ప్రశ్నలు వెయ్యక వెళ్ళు. నేను నీకు విద్య నేర్పటానికి వీలు లేదు.


ఏక: (మరల పాదములపై బడి దుఃఖించుచు) గురూ! మీ రట్లా కోప్పడితే నేను చచ్చిపోతాను. విద్య నేర్చుకోవాలనే తపనతో అలా అడిగానే కాని మిమ్మల్ని ప్రశ్నించే టంతటి వాడినా?

ద్రోణు: (ఏకలవ్యుని లేవనెత్తి) ఓరి. తండ్రీ! నిన్ను కోపపడలేదురా! నా అసహాయత్వం చెప్తానంతే! ధనుర్వేదమే పంచ ప్రాణములుగా బ్రతుకుతున్న నేను. దానిని బహుధా విస్తరింప చేయాలనుకుంటున్న నేను. తద్విద్యార్థియై వచ్చిన ఒకడిని పొమ్మనగలనా? కాని. ఏమి చేయనురా. తండ్రీ! ఇది ప్రభు శాసనము. గురు శాసనము. కాదని నేను స్వతంత్రించినా లోకం హర్షిస్తుందా? నియమోల్లంఘనం చేసిన విద్యలు మాత్రం ప్రకాశిస్తాయా? అసలు నియమములు ప్రకాశనం కొరకే కదా ఏర్పడినవి! వానినే కాదనిన ఎట్లురా? కలిలో కొంత కాలం గడిచిన తరవాత నీ కోరిక సాధ్యమేమో కాని. ఇప్పటి కిదింతేరా. తండ్రీ! ఇంతే!

ఏక: అయితే. గురూ! నా గతి ఇంతేనా? నా కోరిక తీరదా? నే నిట్లా నశించిపోవలసినదేనా?

ద్రోణు: లేదురా. తండ్రీ! లేదు. ఇదిగో నీకు నా ఆశీస్సు. గురువును ధ్యానించుచు. నీ అభ్యాసము నీవు చేయుము. విద్య నీ వెంటబడి అదియే వచ్చును. ఆ సమయమున కాస్ఫురణ నీ కదే వచ్చును. నేను చెప్పున దొక్కటియే! విద్య నెప్పుడును దుర్వినియోగము చేయకుము. జగత్కల్యాణార్థమై ఉపయోగించుము. నీ కోరిక నెరవేరును. ఇక వెళ్ళుము.

ఏక: చాలు. గురూ! చాలు! మీ ఆశీర్వాదమే చాలు. ఇప్పుడే పోయి మీ విగ్రహం పెట్టి నిగ్రహంతో విద్య సాధిస్తాను. మీ శిష్యుడి ననిపించుకుంటాను. నన్ను దీవించండి. (ద్రోణుని పాదములపై బడును.)



ద్రోణు: కీర్తిమంతుడవు కమ్ము. (అని ఆశ్చర్యముగా అశ్వత్థామ వంక చూచును.)

(ఏకలవ్యుడు లేచి నిష్క్రమించును.)

అశ్వ: (నివ్వెరపోవుచు) వీ డెవడో మహాదృష్టవంతుడు. కాకపోయిన మీ నోటి వెంట అట్లు వచ్చునా? వీడేమైన మహారాజా. చక్రవర్తియా కీర్తిమంతుడవు కమ్మని ఆశీర్వదింపబడుటకు!

ద్రోణు: (తల పంకించుచు) అదట్లుంచుము. చూచితివా వీని అల్ప సంతోషము! వీనికి మహాకార్యముల సాధింపగల శక్తి యున్నది. కాని అల్ప సంతోషి యగుట చేత భావ తీవ్రత యధికముగా నుండును. ఆ భావ తీవ్రత యందు వెనుక ముందు లాలోచించనీయని లక్షణ మున్నది. దీనిని తపస్సు చేత జయింపవచ్చును. కాని. వీనికి గురువు నందున్నంత ప్రత్యయము దైవము నందు లేదు. నీకును. వానికిని ఒక్కటే భేదము. వానిది యావేశము. నీది కాఠిన్యము. నిజమునకు విద్య వానికి నేర్పుటలో నున్న ప్రమాదము కన్న నీకు నేర్పుటలోనే ఎక్కువ యున్నది. కాని. నీవు ఉపదేశార్హుడవు. అస్త్రములకు మంత్రము ప్రధానము. ఆ మంత్రము తపోధీనము. పరమ తీక్ష్ణమైన లౌకిక సాధనకూడా తపస్సు వలె భా ింపును. లౌకిక సాధన రజోగుణమయము. మహా మంత్రముల సాధింప వలెనన్నచో సత్త్వ గుణమధికముగా తపస్సు చేయవలెను. తమోగుణావృతులైన నిషాదాదులిందు కొరకే మహామంత్రముల కనర్హులు. కాని. నీ తపస్సు నందు నాకు తమోగుణమే అధికముగా కనిపించు చున్నది. అర్హుడవైన నీవు సత్త్వగుణమును పెంపొందించుము. అస్త్రము లధిక ఫలదాతలు కాగలవు.

ఏ కారణముచే ఈ నిషాదున కీ నాడు విద్య నేర్పకూడదంటినో. అదే లక్షణము నీ యందు కనబడుచున్నను నాకు చెప్పక తప్పక వచ్చినది. నీ వొక కలియుగ జీవుడవు. నీ వొక అపవాదమవు. నీవు చాలక మరియొక అపవాదును నెత్తిన పెట్టుకొందునా?

(- తెర)


## షష్ఠాంకము

(అరణ్యము-ద్రోణుని విగ్రహమునకు తుది మెరుగులు దిద్దుచు ఏకలవ్యుడు)

ఏక: (తనలో తాను)

కం.కుమతులు పలికిన పలుకులు
గమకముగను. మరి తలచగ కడుపుడుకునుగా!
విమలము మధురము సువిదిత
మమరగ సుజనుల పలుకులు సతులము కదరా!

(ఇంతలో చిత్రఘటుడు ప్రవేశించును.)




చిత్ర: ఎందీ. ిన్న దొరో! గజపురం పోతనన్న వాడవ్ ఈడనే ఉన్నవ్! ఇంకా పోలేదా? లేకపోతే ఆళ్ళు రానీలేదా? ఇదేంది. ఈ బొమ్మెవరు?

ఏక: (ఆనందంతో)

కం.దయగల గురువుల కరుణను
నయమున నరయగ సకలము నభయము కదరా!
రయమున ధనువుల చదువును
భయపడి వెనుకను బడుచును వలచును కదరా!

చిత్ర: (సమీపించి) ఏం. దొరా! మా ఉషారు గున్నవ్! ఏంది సంగతి?

ఏక: (ఆనందంతో చిత్రఘటుని ఎత్తి గిర గిర తిప్పి కిందకు దించి) అరే. చిత్రా! "నీ కన్నీ వస్తాయి ఫో" అని గురువు ఆశీర్వదించాడురా? అంతకన్నా ఏం కావాలిరా? మన కన్నీ వచ్చే ినట్లే! మనం ఆడుతూ పాడుతూ ఇంక బాణా లేసుకోవడమే పని.

చిత్ర: ఏందయ్యా నీ పిచ్చి? సంగీతానికి ింతకాయలు రాలతాయా? దీయిత్తే యిజ్జ లొచ్చేత్తాయా? ఆయనేదో తప్పించుకోవడాని కనుంటాడు. ఓహ్! అది పట్టుకుని మా సంబర పడిపోతున్నావ్! సాల్ సాల్లే గాని రా గూడానికి పోదాం.

ఏక: (నవ్వుచూ తిరస్కారంగా) పోరా. సన్నా ిని! చేతనవ్వాలి గాని. సంగీతానికి ింతకాయలేంట్రా ింత సెప్లే రాల్తాయి. నీ కేం తెలుసురా నా గురువు సంగతి? ఆయన మొఖం ఎప్పుడైనా చూశావా నువ్వసలు? అదుగో-ఆ విగ్రహం చూడు సాలు నీ బతుక్కి. ఆయన అన్నాడంటే అంతే! దాని కిహ తిరుగు లేదు. నేను గూడెంలో కొ స్తే కుదరదు గాని. ఇక్కడే ఉంటా. వెళ్ళి పెద్ద దొరతో చెప్పు. మాటి మాటికి అందరూ ఈడకొచ్చి నా సాధన చెడగొట్టద్దని. వెళ్ళు. ఫో!

(అని విగ్రహము ముందు కూర్చుండి కనులు మూసుకొని ధ్యానించుచు కూర్చుండును.)

కం.గురువే తల్లియు తండ్రియు
గురువే బ్రహ్మయు హరియును. గురువే శివుడా
పరదైవము. పరమార్థము
గురువే! చూడగ సకలము గురువే కదరా!

(చిత్రఘటుడు ఆశ్చర్యముతో వెనుక వెనుకకు నిష్క్రమించును.)

-(తెర)-

## సప్తమాంకము

(అరణ్యము- కోలాహలము- అటు ఇటు ఒకరిద్దరు ఈలెలు. ధనుర్బాణములతో పరుగిడుచుందురు.)(దుర్యోధన దుశ్శాసనులు ప్రవేశింతురు.)

దుర్యో: (తెర లోనికి చూచుచు) ఓయి. భీమ సేనా! వేట యనగా అట్లు పరుగెత్తి జంతువుల మీద రాక్షసుల వలె పడి పట్టుకొనుటయేనా?

భీమ: (ప్రవేశించి) కాదు కాదు. పరుగెత్తి పోవు జంతువులను పిశాచముల వలె చాటునుండి బాణములతో కొట్టి చంపుట.

దుశ్శా: అన్నా! క్షాత్ర విద్యా ప్రకాశనము నెఱుగని వారితో ప్రసంగించి ఏమి ప్రయోజనము? రమ్ము.

(అనుచుండగా మరియొక వైపునుండి ధనుర్బాణములతో అర్జునుడు ప్రవేశించును.)

అర్జు: అన్నా! భీమ సేనా! ఇటేదైన నల్లచారల లేడి పరుగెత్తుకొని వచ్చినదా?

భీమ: లేదే! (అని అటు నిటు చూచి) అదిగో! ఆ పొదలచాటున ఛెంగున గాలి లోనికి లేచినది. కొట్టుము.

అర్జు: (బాణము విడచుచు) ఇదిగో కొట్టితిని.

భీమ: (చప్పట్లు చఱచుచు) అదీ! అర్జునా! అదీ క్షాత్ర విద్యా ప్రకాశనమనగా.

(అర్జునుడు నవ్వుచు ఒక వైపునకు. దుర్యోధన దుశ్శాసనులు మొగము గంటు పెట్టుకొని మరియొక వైపునకు నిష్క్రమింతురు.)(మరియొక వైపునుండి ధర్మరాజ సహదేవులు ప్రవేశింతురు.)

భీమ: అందఱును ఆయుధములతో కోలాహలముగా పరుగెత్తుచుండగా. అన్నగా రిట్లున్నాదేమి. సహదేవా? ఏమైన జరిగినదా?

సహ: ఇంతవరకు జరుగలేదు. కాని. ఈ అల్ప జంతువుల నిట్లు చంపుట అన్నగారి కెందుకో అంత ఇష్టముగా లేదట.

భీమ: బాగు బాగు! అల్ప జంతువుల నెవరు చంపుమనిరి? రండు రండు.

గీ.ఏదయిన పులిగాని కా కేన్గు గాని
కనుపడను వచ్చు. యమపురి కనుపవచ్చు.

ధర్మ: (నిర్లిప్తముగా)వచ్చు! ఇంకేదొ జరుగను వచ్చు! ఎవడు కోరిన గొడవ! నే నిట కూరుచుందు.

మీరు కానిండు. ఏమందువు, సహదేవా!

సహ: అన్నగా రన్నట్లే! అన్నా, భీమ సేనా! నీవును, అన్న అర్జునుడును మీ మీ ఉత్సాహముల చంపుకొనకుడు. నీకు తెలియును గదా అన్నగారికి మొదటి నుండియు ఈ మృగయా వినోదము లంత ఇష్టము కాదని. అన్నగా రిచ్చటనే యుందురు.

(ఇంతలో "భౌ భౌ" మని తెరలో ఒక కుక్క యఱపు మహా భయంకరముగా వినబడును.)

సహ: అదిగో! దుర్యోధనుని పెంపుడు జాగిలము మైరావణ మరచుచున్నది. అది సామాన్యముగా కదలదు. కదలినదా ఏదో ప్రమాదము జరిగిన దన్న మాటే!

భీమ: అబ్బబ్బబ్బబ్బబ్బా! దీని అఱపు మహా చిరాకుగా నున్నది. దీనికన్న కాకి గోల నయము. ముందు దీని కంఠము నఱకిన గాని నాకు శాంతి లేదు.

ధర్మ: అది దుర్యోధనుని కుక్క యగుటచేత నీ కట్లనిపించుచున్నది.

భీమ: కాదయ్యా, అజాతశత్రుడా-కాదు. చూచుచుండుము. దాని అఱపునకు వి °సిగి ఎవడో, ఎప్పుడో దాని మెడ నఱకును.

(ఇంతలో కుక్క మొఱుగుటలో మూల్గు వంటి మార్పు వినబడును.)

సహ: వింటిరా, అన్నా! దాని అఱపులోని మార్పు! కంఠము నం దేదో కత్తి దిగినట్లు.

భీమ: చెప్పితిని కదా! చివరకు దుర్యోధనుడే వి °సిగి దాని మెడ పి °సికి యుండును.

సహ: అట్లు జరిగి యుండదు.

భీమ: ఎందుకని?

సహ: అతని కది మహా ప్రియమైన జాగిలము. దాని అఱపు అంతకన్నా ప్రియము.

భీమ: అయిన నేమి జరిగి యుండును?

సహ: ఏమో, నా కెట్లు తెలియును?

భీమ: దాని నెవడైన ఏదైన చే °సినచో దుర్యోధనుడు వానిని వదలునా? వానిపై రాజధిక్కార నేరము మోపి వాని ప్రాణము తీయడూ? ఏమి జరుగుచున్నదో చూతము రండు.

సహ: అక్కరలేదు. ఆతడే వచ్చుచున్నాడు.

(ఒక వైపునుండి దుర్యోధన, దుశ్శాసనులు, మరొక వైపునుండి అర్జునుడు ప్రవేశింతురు.)

దుర్యో: అర్జునా! చివరకు నీ విలువిద్యా కౌశలమును ఈ అల్ప జంతువు మీదనా చూపించునది?

అర్జు: నీ వనునదేమో నా కర్థమగుట లేదు.

దుర్యో: ఓహో! భాష రాదు కాబోలు! అర్థమగుట లేదట! భరతశాస్త్ర ప్రావీణ్యము చాలు గాని, నా మైరావణము నెందుకు కొట్టితివో చెప్పుము ముందు.

అర్జు: మైరావణమును నేను కొట్టితినా? నే నెందుకు కొట్టుదునయ్యా దానిని?

దుశ్శా: ఎందుకు కొట్టుదువో ఎవని కెఱుక? నీవు కానిచో దాని ముఖమున నట్లు బాణములు ప్రయోగింపగల సమర్థు డెవ డిక్కడ? మైరావణమునే చంపుదువుగా! అంత మాతో తగవులాడవలెనని యున్నచో రా! తేల్చుకొందము.(అని ముందుకు రాబోవును.)

భీమ: (తానును ముందునకు వచ్చుచు) అతని కేమో గాని, నీ వనుచుండగా నాకు మాత్ర మనిపించుచున్నది. కానిమ్ము. అదియు తేలిపోవును.

ధర్మ: భీమ సేనా! నీ వాగుము. సుయోధనా! మైరావణమును కొట్టవల °సిన యవసరము మనలో నెవరికైనను ఎందుకుండును? అదేమైన క్రూర జంతువా? ఆహారమునకు పనికివచ్చునా? కనీస మడవి జంతువుకూడా కాదే! వేటకని వచ్చి మన జాగిలమును మనమే చంపుకొందుమా? నీవే యోచింపుము.

దుర్యో: మరెవఱు కొట్టి యుందురు? సరిగా ఏడు బాణములు నేను చూచుచుండగా వచ్చి దాని అంగిటిలో తగిలినవి. ఈతడే కొట్టి యుండు ననుకొంటిమి.

దుశ్శా: మనలో ప్రస్తుతము శబ్దవేధి సాధన చేయుచున్న వా డితడే కదా! తన విద్యా కౌశలమును మన ముందు ప్రదర్శింపవలెనని ఈతడే కొట్టి యుండును.

అర్జు: శబ్దవేధియా! చిత్రముగా నున్నది. సుయోధనా! నేను శబ్దవేధిని సాధన చేయుచున్న మాట నిజమే కాని. మీ రనుచున్న ఆ స్థాయి కింకను రాలేదు. ఒకవేళ వచ్చినను. ఇట్టి అల్ప జంతువుల పైననా ఆ మహా విద్యను ప్రయోగించవల °సినది! నీవు నమ్మినను, నమ్మకపోయినను ఆ కొట్టినది నేను కాదు. నీ వెందుల కిట్లనుకొనుచున్నావో నాకు తెలియుట లేదు. ఆ కొట్టిన దెవరో నాకును తెలుసుకొనవలె ననియే యున్నది.

దుశ్శా: నీవుకాక వేఱెవరు కొట్టి యుందురు?

భీమ: (దుశ్శాసనునితో) నీవే కొట్టి యుందువు. తప్పించుకొనుటకు ఆతనిపై నెట్టుచున్నావు.

వికర్ణుడు: ఏమయ్యా! ఎప్పుడును చమత్కారము లేనా?

భీమ: కాకపోయిన నేమిటయ్యా ఇది? నేను కొట్టలేదు మొఱ్ఱో యని యాత డనుచుండగా, ఈత డూరక నీవుకాక వేఱెవరు కొట్టుదురని రెట్టించు నేమి?

సహ: మరేమి చేయమందువు?

భీమ: తర్కములు మాని మన కుక్కను కొట్టిన దెవరో అడవి అంతయు వెదకి పట్టుకొనవలయును.

(తెఱలో "మీ కా శ్రమ యక్కరలేదు-నేను" అని వినిపించును.)

(అందఱటువైపునకు చూతురు. ధనుర్బాణములు ధరించి ఏకలవ్యుడు ప్రవేశించును.)

ధర్మ: నీ వెవరవు?

ఏక: నిషాదుడను.

ధర్మ: అది తెలియుచునే యున్నది. నీ పేరేమి?

ఏక: ఏకలవ్యుడు.

ధర్మ: నీ తండ్రి పేరు.

ఏక: హిరణ్యధన్వుడు. మా నిషాదుల కాయన రాజు.

ధర్మ: మా వేటకుక్కను కొట్టినది నీవేనా?

ఏక: అవును.

ధర్మ: ఎందులకు కొట్టితివి?

ఏక: దాని అఱుపు చాలా విసుగ్గా ఉంది. నా ఏకాగ్రత కాటంకంగా ఉంది.

ధర్మ: ఏకాగ్రతా? నీ వేమైన తపస్సు చేయుచుంటివా ఇచట?

ఏక: సాధన చేయుచుంటిని.

ధర్మ: ఏమి సాధన?

ఏక: విద్యాసాధన?

సహ: ఏమి విద్యయ్యా?

ఏక: ధనుర్విద్య.


అర్జు: ధనుర్విద్యయా? ఎన్నాళ్ళనుండి సాధన చేయుచుంటివి?

ఏక: ఈ మధ్యనే-ఏడాదికూడా కాలేదు.

అర్జు: ఆహా! అంత తక్కువ కాలములో ఇంత గొప్పగా విద్య నేర్పిన ఆ మహానుభావు డెవరో?

ఏక: శివుడే ఆయన. ఆయనే శివుడు.

అర్జు: నిస్సందేహముగా! వారి పేరు తెలుసుకొనవచ్చునా?



ఏక:వారి పేరా? వారి పేరు...శ్రీ ద్రోణాచార్యులు.

అర్జు: (నివ్వెరపోయి) ఆ(! ద్రోణాచార్యులా?
("ద్రోణాచార్యులా! ద్రోణాచార్యులా" అని అందరు గుసగుసలు పోవుచుందురు?)

దుర్యో: ద్రోణాచార్యులవారి శిష్యుడవా? మే మెప్పుడును చూడలేదే నిన్ను! ఆయన నీ కెట్లు నేర్పుచుండిరి?

ఏక: ఇంతకీ మీ రెవరు?

వికర్ణుడు: మేమును శ్రీ ద్రోణాచార్యులవారి శిష్యులమే!

ఏక: అట్లాగా! అయితే, మిమ్మల్నీ నే నెప్పుడూ చూడలేదే!

దుశ్శాసనుడు: నీ వెట్లు చూడగలవు? మేము హస్తినాపురాధీశ్వరులైన శ్రీ ధృతరాష్ట్ర సార్వభౌముల కుమారులము. ఈ అరణ్యములో మేము తప్ప మరెవ్వరును వేటాడరాదు. మా వేట కుక్కను కొట్టి నీ వపరాధము చేసితివి. దీనికి శిక్ష ఏమియో నీకు తెలియునా?

ఏక: ఓహో! మీ రందరు రాజకుమారులా? సరి సరి! నన్ను శిక్షింపగలవా డీ ప్రపంచములో నా గురువు ఒక్కడే! పొండి పొండి! ఇప్పటికే మీ వలన నా సాధన చాలా పాడైంది. ఇంకా చెడగొట్టక వెళ్ళండి. నేను పోతున్నాను.(అని నిష్క్రమించును.) (అందరు చూచుచు నిలుచుందురు.)

భీమ: ఆహా! ఏమి వీని ధైర్యము! సుయోధనా! మైరావణమును కొట్టిన వీనిని చంపివేయుదు ననుకొన్నానే! ఇట్లు విడిచి పెట్టితి వేమి!

దుర్యో: వాడొక ఆటవికుడు. వానితో నేమి?

భీమ: ఔనౌను. ఆటవికులతో ఆట లంత ఆరోగ్యకరము కావు.

దుశ్శా: అర్జునా! వాడు మన గురువుగారి శిష్యుడ ననునేమి?

అర్జు: నాకు నదియే ఆశ్చర్యముగా నున్నది.


దుశ్శా: ఆశ్చర్య మేమున్నదిలే! నిన్ను తనను మించిన ధానుష్కుని చేయుదు నని ప్రతిజ్ఞ చేసినారట కదా గురువుగారు! ఎందుకైనను మంచిది! ఎటు పోయి ఎటు వచ్చునో అని చాటుగా వీనిని కూడా తయారు చేయుచున్నాడేమో? ఎట్లునూ అడవిలో పుట్టిన వారికి నేర్పుచునే యున్నాము కదా. తప్పేమున్నదిలే అనుకొని యుండును.

భీమ: ఆ! ఆ! అడవి మృగములకు కూడా నేర్పుచున్నాము కదా- తప్పేమున్నదిలే అనుకొని యుండును.

వికర్ణుడు: ఏమయ్యా! ఎక్కడకు వచ్చినను మీ కీ తగవులేనా? నేటి కీ చేసిన వేట చాలుగాని, ఇక రాజధానికి పోదము పదండి. వీని విషయం వెంటనే తాతగారితో, గురువుగారితో చెప్పవలయును. లేనిచో తొండ ముదిరి ఊసరవెల్లి యగును. నేడు మన కుక్కను కొట్టినాడు. రేపు మన మనుష్యులను కొట్టును. ఎల్లుండి మనలనే కొట్టును. వీని నిట్లు వదలరాదు.

(కొందరు "ఔనౌను! వదలరాదు" అనుచుండగా అందరు నిష్క్రమింతురు.)

(తెర)




## అష్టమాంకము

(ద్రోణుని గృహాంగణము. ద్రోణుడు, అర్జునుడు కూర్చొని యుందురు.)

ద్రోణు: అర్జునా! ఇక మిగిలినది నీవు. నే వేమందువు?

అర్జు: నేనేమందును, గురుదేవా?

కం. విలువిద్యను నీ కర్జున!
ఇలసాటి యనగ నసాధ్య మితరుల కంచున్
నలిపిన ప్రతినల వలనే
మి లాభ మిట్లేర్పరుప నమిథ్యా వచనా?

నన్నేమో ఇచ్చట తొందర పడవద్దని, అడవిలో ఆ ఏకలవ్యుని నన్ను మించిన వానిగా చేయుటలో మీ అంతర్యము నాకు బోధపడుట లేదు. మీ ప్రియ శిష్యు డగుటకు అత డేమి తపస్సు చేసెనో కదా!

ద్రోణు: ఓయి, పిచ్చివాడా! నీ కన్న తపశ్శాలి ఎవడోయి! పుంజీభూత వినయమూర్తివే! నీ కన్న నాకు ప్రియ శిష్యు డుండునా? నీ దోష మేమియు లేదు. ఇదేదో నా జాతకములో నిట్టీ యపకీర్తి పడవలసిన లక్షణ మున్నట్లున్నది.

అర్జు: గురుదేవా! క్షమించుడు. మిమ్ము నొప్పించితిని. అయినచో నాత డసత్యమాడి యుండునా?

ద్రోణు: లేదయ్యా! సత్యమే ఆడియుండును. నా కాతడు శిష్యుడు కానక్కర లేదు- నే నాతనికి గురువును కావచ్చును.

అర్జు: ఏమంటిరి?

ద్రోణు: ఏమున్నదయ్యా! ఆతడు నన్ను గురువుగా భావించి, తాను నా శిష్యుడనవచ్చును. కాని, ఆతనిని శిష్యునిగా స్వీకరించినే నాతని గురువుననవలెకదా!

అర్జు: అయినచో నాతడు ఈ విద్యను స్వశక్తితో సాధించినట్లే కదా! మీ బాధ్యతేమున్నది?

ద్రోణు: నీ వన్నది లౌకికముగ యదార్థమే! కాని, ఇందులో నొక రహస్యమున్నది. పూర్వ మాతడు నన్నాశ్రయించినప్పుడు అతనికి విద్య నేర్పుట కనుమతి లేదని చెప్పుచు "గురువును ధ్యానించుచు నీ అభ్యాసము నీవు చేయుము. విద్య నీ వెంటబడి అదే వచ్చును. ఆ సమయమున కా స్ఫురణ నీ కదే వచ్చును" అని ఆశీర్వదించి పంపితిని. ఆ వాగ్బలమున వాడక్కడ నిరంతరాభ్యాస మగ్నుడై యుండగా, నే నిచ్చట సమాధిలో నుండగా ఈ రహస్యములు వానికి స్ఫురించుచున్నవి కాబోలును. అయినచో అది మరీ ప్రమాదము. ఈ శబ్దవేధినే శునకముపైన ప్రయోగించిన వీడు అధికాస్త్రవేత్త యైనచో నింకేమి చేయునో? మొక్కై వంగనిది మ్రానై వంగునా? వీని సంగతి నిప్పుడే మాడవలయును. భీష్మాదులు వీడు నా శిష్యుడని శిక్షింపక మిన్నకుందురు. దీనితో నీ భారము నా పైని పడుచున్నది. నేను పోయి శిక్షించుటకు నా కధికారము లేదు. చూచితివా వ్యవహార మెటు వచ్చినదో? నే నుపేక్షించితినా, వీనితో నేదో ప్రయోజన మపేక్షించితినని తుదకు నీవుకూడా అనుమానింతువు. ఉపేక్షింపక శిక్షించుటకు పోదునా వీని కేమి సంబంధమని లోకము నన్ను విమర్శించును. నేనేమి అధికృతుడనా? ప్రాడ్వివాకుడనా? కనీసము గురువు నైనను కాదే! ఏ అధికారముతో వానిని శిక్షించుటకు పోదును? పోనీ, దైవ మిట్లున్నదని వదలి వేయుదునా! ఆ సమయమున కా స్ఫురణ నీ కదే వచ్చునని చేసిన వాగ్దాన ఫలితమే కదా ఇది! ఇంక నొక్కటే మార్గము. ఈ ఏకలవ్య శిష్యునికి నా గురుత్వ మంగీకరించి, వీనిని పరీక్షించి రావలయును. ఏది ఏమైనను ఆ నారాయణు డున్నాడు. నీ వున్నావు. పద. వాని నొకసారి చూచి వత్తము.

తెర-

## నవమాంకము

(హిరణ్యధన్వుడు. చిత్రఘటుడు ప్రవేశించును.)

హిరణయ: ఏందిరా, సిత్రా! మీ నేస్తు యిజ్జ ఎంత దూర మొచ్చెరా?

చిత్ర: ఎంత దూరమేంది, దొరా! కనబడనంత దూరాన, ఇనబడనంత సప్పుడయితే దాన్ని ఫటాల్న కొట్టేస్తున్నాడు.

హిరణ్య: అదేం సప్పుడో తెలుసుకోకుండా కొడితే పెమాదం కాదంట్రా!

చిత్ర: మరీ అంత తెలుసుకోకుండా కొడతామా ఏంది, దొరా! ఆ రాముడి తండ్రి కత మాకు తెలుసులే! మొన్న ఆ గజపురం రాజు కొడుకులు ఎటకొస్తే, ఆళ్ళ ఎటకుక్క! ఓహ్ దాన్సిగ తరగ! కనబడదు, సావదు-

సెట్ల సాటున ఒహటే అరుపు. ఎడు బాణాలు లాగి ఏ సిందు. ఎం గురి. దొరా! అన్నీ కలి సి దాని అంగిట్లో దిగబడినాయ్! నచ్చారు కుంది దెబ్బకి. రాచకొడుకులే గడగడ లాడి పోయింద్రు. దొరా, ఆ దెబ్బకి!

హిరణ్యా: రాసోళ్ళ కుక్కను కొట్టిండా? అదేం పనిర?

చిత్ర: ఏం. దొరా! ఈ సారి ఆళ్ళనే కొట్టమంటవా ఏం?

హిరణ్యా: ఛ స! నోర్ముయ్. నన్నా సి! సాలున్నర సాము చే సి మూల నున్న ముసలమ్మని కొట్టరా అని శబ్దయేది లాటి యిజ్జ నేరి సింది సివర కిలా కుక్కల్నీ, పిల్లుల్నీ కొట్టటానికంద్రా? ఇ దా గురువుకి తెలి స్తే ఊరుకుంటాడ్రా?

చిత్ర: ఏం చేస్తాడు. దొరా?

హిరణ్యా: ఏం చేస్తాడా? ఏ కాలో, యేలో తీ సేస్తాడు. పద, పద.

(ఇద్దరు నిష్క్రమింతురు.)

ఇది ప్రవేశకము

(ఏకలవ్యుని సాధనా ప్రదేశము. ద్రోణుడు, అర్జునుడు, ఏకలవ్యుడు ప్రవేశింతురు.)

ఏక: గురూ! నన్ను కరుణించి ఇంత దూరం వచ్చారు. మీకు నే నేం మర్యాద చేయగలను?

ద్రోణుడు: మర్యాదలకేమి కాని. (అర్జునుని చూపించుచు) ఈతని నెఱుగుదువా?

ఏక: మొన్న చూశాను గాని. ఎవరో రాజకుమారు డనుకున్నాను. ఇవ్వాళ మీ వెంట వచ్చాడంటేనే తెలుస్తోంది మీ ప్రియ శిష్యుడు కాగల్గిన గొప్ప అదృష్టవంతుడని. అయ్యా! నమస్కారము.

అర్జు: ఏకలవ్యా! నా కన్న పెద్దవాడవు. నేనే నీకు నమస్కరించుచున్నాను.

ఏక: అయ్యా! రాజకుమారుడివి- నువ్వు నాకు నమస్కారం చేయవచ్చునా?

అర్జు: తప్పు లేదయ్యా! తనకన్న వయస్సులో పెద్దవా డెదురైనప్పుడు కుల భేదం పాటింపక గౌరవింపమని ధర్మశాస్త్రం చెబుతోంది.

ఏక: ఆహా! రాజకుమారులలో నీ లాంటి వినయశీలిని నే నింతవరకు చూడలేదు.

ద్రోణు: ఈ మర్యాదల కేమిగాని. ముం దిది చెప్పుము. అందరతో నా శిష్యుడనని చెప్పుకుంటున్నావట- నిజమేనా?

ఏక: స్వామీ! "గురువును ధ్యానిస్తూ నీ సాధన నువ్వు చెయ్యరా" అన్నారు. మీరే నా గురువు! అదిగో! మీ విగ్రహాన్ని పెట్టుకొని. మీ రెదురుగా ఉన్నట్లే అనుకొని సాధన చేస్తున్నాను. మహానుభావులు. మీ రేదో చెపుతున్నట్లే ఎప్పుడూ వినిపిస్తూంది నాకు. మీరే నా గురువని గొప్పగా చెప్పుకుంటున్నాను. తప్పైతే క్షమించండి.

ద్రోణు: అందులో తప్పేమున్నది? చెప్పుకో! కాని. నీవు చే సిన తప్పు వేరే ఉంది. అది నీకు తెలియడం లేదా?

ఏక: గురూ! క్షమించండి. తెలి సి నేనే తప్పూ చేయలేదు.

ద్రోణు: తెలి సి చే స్తే ఏ బాధా లేదు. తెలియక చేశావని అనుకోబట్టే ఈ వేదన.

ఏక: అదేమిటో చెప్పండి. గురూ! దిద్దుకుంటాను.

ద్రోణు: శబ్దవేధితో వీళ్ళ వేటకుక్కను కొట్టినావట! నిజమేనా?

ఏక: నిజమే. గురూ!

ద్రోణు: ఎందుకని? అది నీ మీదికి వస్తోందనుకున్నావా? లేక నీ శబ్ద వేధిని పరీక్షించుకుందా మనుకున్నావా?

ఏక: లేదు. గురూ! నే నిరంతర పూజ చేసుకుంటున్నాను. కొంచెం దూరాన దాని అరుపు మహా చిరాకుగా వినిపించింది. అది ఆపకుండా అలా అరుస్తూనే ఉంది. నా కేమో పూజ కుదరటం లేదు. దాంతే విసుగెత్తి అరుపు వినిపించే దిక్కుగా బాణాలు తీ సి అది మళ్ళీ మొరగడానికి వీల్లేకుండా దాని నోట్లో బాణా లేశాను.

ద్రోణు: అంటే. అది కుక్క అని తెలి సే. దాని అరుపును విని. అది ఎటువైపు ఉందో తెలుసుకొని. అరుపుకీ అరుపుకీ అది పరుగెత్తే దూరాన్ని లెక్కించి. అది అరవకుండా సరిగ్గా దాని నోట్లో బాణాలు వేశానంటావు. అంతేనా?

ఏక: అంతే. గురూ!

ద్రోణు: అరవకుండా ఎందుకు వేశావు? దాని అరుపు చాలా చిరాకుగా. నీ పూజ కంతరాయంగా ఉండబట్టే.

ఏక: అవును. గురూ!

ద్రోణు: అయితే. నీ ధ్యానమున కంతరాయం కలిగించాలని అది అరచిందంటావా? లేక దాని ధర్మంగా అది అరచిందంటావా?

ఏక: (తల వంచుకుని నిలబడును)

ద్రోణు: ఏమిరా మాట్లాడవు? ఇంత లెక్క చే సిన వాడవు. "అయ్యో! ఇది కుక్క కదా! దీని సహజ లక్షణం మొఱగడమే కదా! అది మన కేమి అపకారం చే సింది?" అని ఆలోచించలేకపోయినావా? శబ్దవేధి వంటి మహా విద్యను నికృష్ట జంతువైన శునకము పైన ప్రయోగింపవచ్చునా అని లెక్క చేయలేకపోయినావే! ఎంత విద్య నేరి స్తే మాత్ర మేమి ప్రయోజనంరా- ప్రయోగౌచిత్యం లేకపోయిన తరువాత? రాయి. శునకమే! ఒకవేళ కఱవడానికే వచ్చిందనుకో! కాలితో తంతాం. కర్రతో కొడతాం. అంతేగాని పిచ్చుకపైని బ్రహ్మాస్త్రమన్నట్లు ఇలాగా? ఛీ ఛీ! దీనికి తోడు నా శిష్యుడనని నలుగురిలో నా కప్రతిష్ఠ? ఛీ! దౌర్భాగ్యుడా! నీ ముఖం చూ స్తేనే పాపం.

ఏక: (దుఃఖించుచు) గురూ! క్షమించండి. ఇంత ఆలోచించలేకపోయాను. మూర్ఖుణ్ణి. మీ కప్రతిష్ఠ తెచ్చాను. నన్ను క్షమించండి.

ద్రోణు: నే నెవడనురా నిన్ను క్షమించుటకు?

ఏక: (పాదములపై బడి) అంత మాటనకండి. గురూ! చచ్చిపోతాను. మీరే నా దైవం. మీరే నా సర్వస్వం. మీరు కాకపోతే నన్నెవరు క్షమిస్తారు? అయినా నన్ను క్షమించడ మేమిటి? వద్దు. ఇదిగో కత్తి. నన్ను ముక్కలు ముక్కలుగా నరికేయండి.


ద్రోణు: అను ఏమి పాపకర్మమురా! నీ ప్రవర్తన ఎట్టున్నను. నీవు గొప్ప ధానుష్కుడవు. అది నిస్సంశయము. నీ విద్య పూర్తి యయినది. ఇక నా నుండి నీకు ఏ స్ఫూర్తులు రావు. నేను వెళుతున్నాను. అర్జునా! పద.


ఏక: (లేచి వారించును) గురూ! నాకు విద్య నేర్పారు. నా తప్పు కాచారు. నా విద్య పూర్తయిం దంటున్నారు. కనీసం గురుదక్షిణ తీసుకుని నన్ను రక్షించండి.

ద్రోణు: గురుదక్షిణా! ఎంత మాటన్నావురా? నీ వేమిస్తావురా గురుదక్షిణ?

ఏక: నా ప్రాణాలైనా ఇస్తాను. ఆజ్ఞాపించండి. గురూ!

ద్రోణు: ప్రాణాలెందుకురా నాకు? అయినా ప్రాణా లివ్వడం తేలికే! ప్రాణప్రద



# మీకు నచ్చే పుస్తకాలు

1. దైవదర్శిని:- బాధల విముక్తికి దైవరహస్యాలు. రూ॥15
2. వ్యవహారదర్శిని:- నమూనాలతో వివిధపత్రాలువ్రాసేవిధం. రు.15
3. ఆహారవైద్యము:- ఏరోగానికి ఏఆహారం తినాలో ఉంటుంది. 15
4. మూలికావైద్యము:- అల్లం, ఇంగువలాంటివాటితో. రు.15
5. ఐదువైద్యవిధానాలు:- అల్లోపతి, ఆయుర్వేద, హోమియో, చిట్కామ్మె. 30/-
6. సేల్సుటాక్సు:- వ్యాపారుల రక్షణకు వివరాలుసర్వం. రు.25
7. ఇన్‌కంటాక్సు:- సంపన్నుల భద్రతకు సర్వవివరాలు. రూ॥25
8. మీస్వప్నఫలితాలు:- సర్వ స్వప్నాల డిక్షనరీ. రూ. 10
9. మానసికశక్తులు:- అతీంద్రియ శక్తులసర్వస్వం. రూ॥10
10. రసికప్రియకథలు:- గొప్ప శృంగారహాస్య కథలు. రూ. 10
11. జీవితరహస్యాలు:- కామవిజయాలకు మార్గాలు. రు.10
12. యువతి:- స్త్రీలదాంపత్య ఆనందానికి మార్గాలు. రు.10
13. సంతానము:- గర్భనిరోధానికి 60 మార్గాలు. రు.10
14. చేతిపనులు:- సులభమైన కుటీరపరిశ్రమలు. రూ. 10
15. మంత్రశక్తి:- వివిధ మంత్రాల రహస్యాలు. రూ. 10
16. అద్భుతహాస్యకథలు:- నవ్వి నవ్వించటానికి. రూ. 10

రూ. 40కి, తక్కువగాని ఆర్డర్లకు పోస్టేజీ రూ. 7 ఉచితం. దేశసేవప్రచురణాలు, 2, ఇందిరానగరు, వెంగళరావునగరు పోస్టు, హైదరాబాదు-500890 కి ఉత్తరం వ్రాసి వేటిలో మీకిష్టమైనవాటిని వి.పి. పోస్టుద్వారా పొందండి



## నిశ్శబ్దంగా మీకోసం పనిచేస్తున్నవి
## — సి పి సి ప్రీమియర్ పంపు సెట్లు

సి పి సి ప్రీమియర్ గృహోపయోగ పంపుసెట్లు పని చెయ్యడంలో అధిక పొదుపువేసేవి, అత్యంత బలిష్ఠమైనవి ఎళ్ల తరబడి ఇబ్బంది కలిగించని సేవకు హామీ ఇచ్చేవి.
30 ఎళ్లనుండి ప్రీమియర్ పంపుసెట్లను తయారుచేస్తూవున్న సి పి సి వారిచే ఇవి తయారుచేయబడుచున్నవి.
సి పి సి ప్రీమియర్ గృహోపయోగ పంపుసెట్లు 1/8 హెచ్.పి. నుండి 2 హెచ్.పి. వరకు గల సైజులలో లభ్యం.
సి పి సి ప్రీమియర్ పంపుసెట్లు యీ కంపెనీ బ్రాంచీలలోను, డీలర్ల మూలంగాను, అన్నిచోట్లాలభ్యమౌతున్నవి.
పంపుసెట్లు కొన్న తరువాత మీకు అవసరమైన సర్వీసు సౌకర్యాలు వారే చేయగలరు.



సిపిసి ప్రీమియర్

మీ కుడిచేయి వలె విశ్వసించ తగినది

**కోయంబత్తూరు ప్రీమియర్ కార్పొరేషన్ (P) లిమిటెడ్**
5-2-130/131, రాష్ట్రపతి రోడ్డు, బైబుల్ హౌస్ ఎదురుగా,
సికింద్రాబాద్-500003. Grams : Ceepeecee

23 TG/AB/AP


మైన. దానిని ఇవ్వడమే కష్టం. ఏదేమైనా అంత మాటన్నావు. అదే చాలు. ఇటువంటి తప్పులు మరెన్నడూ చేయకుండా ఉంటే అదే నాకు గురుదక్షిణ.

ఏక: అలా కాదు, గురూ! మీరు నిజంగా నన్ను క్షమించానంటే ఏదైనా గురుదక్షిణ అడగండి.

ద్రోణు: అంగుష్ఠమాత్ర నిషాదుడవు. నిన్నేమి అడగనురా?

ఏక: అలా అనకండి, గురూ! ఏదైనా అడగండి.

ద్రోణు: నిన్ను మనఃస్ఫూర్తిగా క్షమించాను గాని. నీ గురుదక్షిణా వద్దు. నీవూ వద్దు. నేను పోతున్నాను.

ఏక: గురూ! మీరు గురుదక్షిణ అడగకుండా వెళితే మీకు నా మీద కోపం పోలేదనే అనుకుంటాను. మీరు నన్ను క్షమించలేదనే అనుకుంటాను.

ద్రోణు: ఇదెక్కడి గోలరా, దుష్టుడా! సరే, అయితే! దక్షిణగా నీ దక్షిణాంగుష్ఠం అడుగుతున్నాను. ఇవ్వగలవా?

ఏక: అంతకన్నానా, గురూ! (చేతిలోని కత్తితో తన కుడి చేతి బొటన వ్రేలు నఱకి కొనును.)

(ద్రోణుడు నిశ్చేష్టుడై చూచుచుండును.
అర్జునుడు "అయ్యయ్యో" అనుచు తన ఉత్తరీయపు కొంగుతో ఏకలవ్యుని రక్తము కారుచున్న చేతిని నొక్కి పట్టి)

అర్జు: ఆహా! ఇంత మహా గురుభక్తుడు... ఇతని కింత శిక్షయా? గురుదేవా! దీని కంతటికి నేనేకదా కారణము?

ద్రోణు: నీ వెట్లగుదువు?

అర్జు: నే నతని గురించి మీతో ఇంతగా చెప్పకపోయినచో మీ రిట్లు వచ్చెడివారు కారేమో? ఇట్లు జరిగెడిది కాదేమో?

ద్రోణు: అది నీ భ్రాంతి. నీవు కాకపోయిన మరొకరు చెప్పియుండెడివారు. నా కీ బాధ్యత ఎప్పుడును నున్నది. ఇంత భావావేశపరుడు వీ డెప్పుడు నిట్లే చేసెడివాడు.

ఆ శునకము నకారణముగా హింసించిన ఫలితము వీని కిట్లు ఎదురైనది. వీడు మహా పుణ్యజీవి. కావున ఆ పాప ఫలిత మిట్లు వెంటనే ఎదురై ఇది ఇంతటితో పోయినది. ఆలస్యమైన కొలది అది పెరిగి పెరిగి మరియు తీవ్ర రూపము దాల్చును. ఇది భగవన్నిర్ణయము. నీవుగాని, నేనుగాని ఇందు నిమిత్తమాత్రులము. (ఏకలవ్యుని వైపు తిరిగి) ఓరీ! ఏకలవ్యా! నీ అసామాన్య గురుభక్తికి మెచ్చితిని. దీని కోసమైనను నే నిప్పుడు నీకు ప్రత్యక్షముగా గురువు నౌదును. అర్జునా! తర్జనీ మధ్యమాంగుళులతో లాగి బాణములను వేయు సంప్రదాయ మొక టున్నది. అది వీనికి నేర్పెదను.

అర్జు: అవశ్యము, గురుదేవా!

ఏక: గురుదేవా! చూశారా? నా బొటన వ్రేలు పోవడంకూడా నా మంచికే జరిగింది. ఈ విధంగా నైనా నేను మీకు ప్రత్యక్ష శిష్యుడి నవడానికి వీలైంది. ఆహా! ఎంత అదృష్టవంతుడిని నేను!

ద్రోణు: ఓరి, పిచ్చితండ్రీ! (అని ఏకలవ్యుని, అర్జునుని దగ్గరకు తీసుకొనుచు) గురువు కన్న గురుభావమే గొప్పదన్న ఒక కొత్త విద్యా సంప్రదాయము నేటినుండి నీ పేరుతో ప్రచారము లోనికి రాగలదు. అర్జునా! త్రేతాయుగములో శ్రీరామచంద్రు డెంత ధానుష్కుడో, ద్వాపరాంతమున అర్జును డంతటి ధానుష్కుడన్న ప్రశంస్తి నీకు వచ్చును. నా శిష్యులలో మీ ఇద్దరి వలననే చరిత్రలో నా పేరు శాశ్వతముగా నిలచిపోవును. మీ రిద్దరు నా రెండు కన్నులు.

ఏక: గురుదేవా! మీరు శివుడి అవతారము. మీకు మూడు కన్ను లున్నాయి.

అర్జు: ఆ మూడవ కన్ను గురుపుత్రు డశ్వత్థామ.

ద్రోణు: బాగుగా చెప్పితివి. వాడొక అగ్ని నేత్రము.

-తెర-

సూత్రధారుడు ప్రవేశించును.

సూత్ర: శా. కాలాంతోజ్జ్వల కోటి సూర్య సమతీక్ష్ణజ్వాల మాలా లస
త్ఫాలాక్షానల దగ్ధ మాధవ సుతా భావంబు పూరింప ను
ద్వేలోద్దామ వికీర్ణ చంక్రమణ వైదేహాతి భావంబు కా
వాలమ్మె - బ్రదికించుట లన్కగ కన్పట్టున్ విచిత్రంబుగా.
ఉ. అంతియ కాని స్వామి! అతయంగను నీకును గాని యుండునే?
ఇంతయు చిన్న చూపు మరి యెవ్వరి పైనను. గాని శ్రీగళా!
వంతులు పోయి తాను అల పైకిని నెవ్వడొ తెచ్చుకో నదే
వింతలు గాగ చెప్పికొను విశ్వము బ్రోవుము విశ్వనాథుడా!

ఇది భరతవాక్యము-

(సమాప్తము)